
నూరేళ్ళ తెలుగు కథకు నవ్య నీరాజనం - 27



# బాపు దగ్గర ఆరేళ్ళపాటు అసిస్టెంట్‌గా ఉన్నాను

**- ఎస్. శంకర నారాయణ**


చార్‌కోల్‌తోనో, పెన్సిల్‌తోనో ఇటీవల ముమ్మరంగా కనిపించే పోర్ట్రయిట్స్ చూసి 'ఇవి శంకరనారాయణ బొమ్మలు! బాగానే ఉంటున్నాయి' అంటున్నారంతా. ఎస్.శంకరనారాయణ అనబడే ఈ సత్తిరాజు శంకరనారాయణ ఎవరో తెలుసా? ప్రముఖ చిత్రకారుడు బాపు లేరూ? ఆయనకి స్వయానా తమ్ముడు. ఇంకో మాటలో చెప్పాలంటే రచయిత ముళ్ళపూడి వెంకటరమణ లేరూ? ఆయనకి ఈయన వియ్యంకుడు. నవ్వుతూ మాట్లాడడం, మాట్లాడుతూ నిండుగా నవ్వడం శంకరనారాయణగారికే చెల్లింది. 'నా ఆరోగ్య రహస్యం నవ్వే' అంటారాయన. ఆయనతో ఇంటర్వ్యూ ఈవారం మీకోసం...

### మేము ముగ్గురం

మా అమ్మగారు సూర్యకాంతమ్మ. నాన్నగారు వేణుగోపాలరావు. నాన్నగారు మద్రాసు హైకోర్టులో అడ్వొకేట్‌గా ఉండేవారు. మేం ముగ్గురు అన్నదమ్ములం. పెద్దవాడు బాపు. రెండోవాణ్ణి నేను. మూడోవాడు రాంనారాయణ. మేం ముగ్గురం పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలో మా అమ్మమ్మ గారింట పుట్టాం. నేను 1936లో పుట్టాను.

### మా అన్నయ్య చిన్ని కృష్ణుడు

మా అన్నదమ్ముల్లో బాపు బాగా అల్లరి చేసేవాడు. ఆ అల్లరి భరించలేక నాన్నగారు ఓసారి బాపుని మేడ మెట్ల మీద నుంచి కిందికి తోసేశారు. అదృష్టం బాగుంది. బాపుకి దెబ్బలు తగల్లేదు. చెబితే నమ్మరు. అల్లరి చెయ్యకుండా ఉండడానికి చిన్ని కృష్ణుణ్ణి తాళ్ళతో కట్టినట్టుగా బాపుని కట్టేసేవారు.


వియ్యంకుడు రమణ, సోదరుడు బాపుతో..

### చదువంతా చెన్నైలోనే...

నా చదువంతా చెన్నైలోనే సాగింది. ఫస్ట్‌క్లాస్ నుంచి ఎస్ఎస్ఎల్‌సి వరకు కేసరి హైస్కూల్‌లో చదువుకున్నాను. లయోలా కాలేజీలో ఆనర్స్ చేశాను. ఎం.ఎ. కూడా అయిపోయింది. అయినా ఆరేళ్ళ వరకు ఉద్యోగం దొరకలేదు.

### బాపుకి అసిస్టెంట్‌గా...

నేనూ, బాపు లయోలా కాలేజీలో చదువుతున్నప్పుడే మా నాన్నగారు చనిపోయారు. దాంతో పెద్ద కొడుగ్గా ఇంటి బాధ్యతంతా బాపునే వహించాల్సి వచ్చింది. నాకు ఉద్యోగం లేని ఆరేళ్ళూ బాపుకి సహాయకుడిగా పనిచేశాను. అంటే బొమ్మలు వేసేననుకునేరు. కాదు. బాపు వేసిన బొమ్మల్ని తీసుకుని వెళ్ళి పత్రికలకు అందించడం, వాళ్ళు పారితోషికం ఇస్తే జాగ్రత్తగా తెచ్చి బాపుకివ్వడం చేసేవాణ్ణి.

### భయం కాదు గౌరవం

బాపు చాలా స్ట్రిక్ట్. బాగా డిసిప్లిన్. ఏ కుంచె ఎక్కడుండాలో అక్కడే ఉండాలి. అలాగే ఏ పుస్తకం ఎక్కడుండాలో అక్కడే ఉండాలి. ఏది అటు నుంచి ఇటయినా, ఇట్నుంచటయినా గొడవే! ఎందుకిలా జరిగిందని బాపు ప్రశ్నిస్తే...సమాధానం చెప్పేవాళ్ళం కాదు. తలలొంచుకుని నిలబడేవాళ్ళం. అలా అని అన్నయ్యంటే భయం కాదు, గౌరవం.

### గొప్పగా ఉండేది

ఆ రోజుల్లోనే ముళ్ళపూడి వెంకటరమణగారితో పరిచయం కలిగింది. ఆదుర్తి సుబ్బారావు, వీణ చిట్టిబాబుగారు... వీళ్ళందరూ అప్పుడే పరిచయం అయ్యారు. అన్నయ్య దగ్గరికి గొప్ప గొప్ప వాళ్ళు వచ్చేవారు. వాళ్ళను చూడడం...వాళ్ళతో మాట్లాడడం చాలా గొప్పగా ఉండేది నాకు.

### బాపు-ముళ్ళపూడి కాపాడారు

అప్పుడే అనుకుంటాను నాకు టైఫాయిడ్ వచ్చింది. ఆసుపత్రిలో 16 రోజులున్నాను. నా మీద ఆశలొదిలేశారు. అయిపోతాననుకున్నారంతా. అయితే రమణగారు, బాపు చేసిన సేవలతో నేను కోలుకున్నాను. నన్ను కనిపెట్టుకుంటూ రమణగారు నా రూంలో ఉంటే...అన్నయ్య బాపు ఎప్పుడు ఏది అవసరమవుతుందోనని ఆసుపత్రి బయట చెట్టుకింద కారులో కూర్చుని కాపలా కాసేవాడు. అప్పుడే రమణగారు ఏదో వెండితెర నవల కూడా రాశారు.

### 'శంకర్' అంటే నేనే! బాపు కాదు

ఈ పోర్ట్రయిట్స్ వేయడానికి ముందు అందరిలాగే నేనూ కార్టూన్లు వేశాను. అప్పుడు ఆంధ్రపత్రిక నిర్వహించిన కార్టూన్ల పోటీలో నా కార్టూన్‌కు ప్రథమ బహుమతి వచ్చింది. కార్టూన్ ఏంటంటే...పిలక బ్రాహ్మడు కుక్కను తరుముతోంటే...పిల్లి అడ్డంగా రావడంతో అతను ఆగిపోతాడు. అది మొదలు 'ఎప్పుడూ ఇంతే' శీర్షికన ఆంధ్రపత్రికలో వారం వారం కార్టూన్లు వేసేవాణ్ణి. అప్పుడా కార్టూన్లు బాగా పాపులర్ అయ్యాయి. ఇంతలో కొన్ని అనివార్య కారణాల వలన ఆ శీర్షికను నేను కొనసాగించలేని పరిస్థితి ఏర్పడితే...శీర్షికను నిలిపివేయడం ఇష్టం లేని బాపుగారు దాన్ని నా పేరు మీదే కొనసాగించారు. దీంతో 'శంకర్' అంటే బాపు అని ముద్రపడిపోయింది.



కుటుంబ సభ్యులతో...

### నా బొమ్మలే నాకు ఉద్యోగం తెచ్చిపెట్టాయి

1962లో యుపిఎస్‌సి రాసి, సెలెక్టయ్యాను. రేడియోలో ఉద్యోగం. నారాయణ మీనన్ అని, ఆయన అందర్నీ ఇంటర్వ్యూ చేస్తున్నారు. అప్పుడే సత్యం శంకరమంచి, గొల్లపూడి మారుతీరావు కూడా ఇంటర్వ్యూకు హాజరయ్యారు. వాళ్ళిద్దరూ అప్పటికే పెద్ద రచయితలు. పుస్తకాలు చంకనుంచుకుని మరీ వచ్చారు. మనవాఁ పుస్తకాలు రాయలేదు. పోనీ పుస్తకాలు చదివే అలవాటు ఉందా అంటే...అదీ పెద్దగా లేదు. సంగీతం అస్సలు తెలీదు. ఈ క్వాలిఫికేషన్స్ చాలు నాకు ఉద్యోగం రాకపోవడానికి. అయినా చిత్రంగా నాకు ఉద్యోగం వచ్చింది. ఇంటర్వ్యూలో నెగ్గేశాను. అదెలా సాధ్యమయిందంటే...అప్పటికే

చార్‌కోల్‌తో బొమ్మలు వేయడం నాకలవాటవ్వడంతో ఓ నాలుగు బొమ్మలు ఎందుకైనా మంచిదని కూడా తీసుకొచ్చి ఇంటర్వ్యూలో మీనన్‌గారికి చూపించాను. 'బొమ్మలు బాగున్నాయి. యు ఆర్ సెలెక్టెడ్' అన్నారాయన. బొమ్మలకీ, రేడియో ఉద్యోగానికి ఏమిటి సంబంధం? నాకెలా ఉద్యోగం ఇవ్వగలుగుతున్నారని మీనన్‌గారిని నేనడిగితే–

'మీ నిజాయితీ నాకు నచ్చింది. మీరు ఎడ్మినిస్ట్రేషన్ సైడులో బాగా రాణిస్తారు. కీపిట్ అప్' అన్నారు. అంతే! 1995 వరకు రేడియోలో నెట్టుకొచ్చేశాను. రేడియోలో ఉద్యోగం రావడం నా అదృష్టం. అక్కడ మహామహులను చూశాను. వారితో కలసి పని చేశాను.



శంకర నారాయణ తల్లి సూర్యకాంతమ్మ, శ్రీమతి శాంత రేఖాచిత్రాలు

## బొమ్మలు తిండిపెట్టవు

బొమ్మలు వేయడాన్ని మా నాన్నగారి దగ్గర్నుంచీ మేము నేర్చుకున్నాం. నాన్నగారు బొమ్మలు బాగా వేసేవారు. ఆయన్ని చూసి బాపు నేర్చుకున్నాడు. బాపుని చూసి నేను మొదలెట్టాను. అయితే మేము బొమ్మలు వెయ్యడం మా నాన్నగారికి నచ్చేది కాదు. 'ఏంటా బొమ్మలు? తిండి పెట్టవవి' అని తిట్టిపోసేవారు. తర్వాత మేము లేని సమయంలో మా బొమ్మలనే అందరికీ చూపించి–

'పిల్లలెంత బాగా వేశారో చూడండి' అని ఆనందించేవారు. ఆ రోజుల్లోనే ఓ మిత్రుడికి సైన్స్ రికార్డు మొత్తం నేను వేశాను.

## పిల్లలు-ప్రేమలు

1964లో నాకు పెళ్ళయ్యింది. నా భార్య పేరు శాంత. మాకు ఇద్దరమ్మాయిలు. ఒకబ్బాయి. పెద్దమ్మాయి ముళ్ళపూడి వారి కోడలు. సినీ దర్శకుడు వర ముళ్ళపూడిని ప్రేమించి పెళ్ళి చేసుకుంది. రెండో అమ్మాయి కూడా అంతే! ప్రేమించే పెళ్ళి చేసుకుంది. అల్లుడుగారు క్రిస్టియన్. మా వాడు తుళు అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. మొత్తానికి మా పిల్లలు ముగ్గురివీ ప్రేమ వివాహాలే! అదలా ఉంచితే చిత్రంగా మా కుటుంబం అంతా మీడియాలోనే ఉంది.

## శ్రీమతి ఇష్టమే ఈ చిత్రాలు

1995లో మద్రాస్ ఆల్ ఇండియా రేడియో స్టేషన్ డైరెక్టర్‌గా రిటైరయ్యాను. అప్పట్నుంచీ ఈ బొమ్మలు వేయడం ముమ్మరం అయింది. ఇలా బొమ్మలు వేయడం నా భార్యకు చాలా ఇష్టం. బొమ్మలు వేయమని ఆవిడే పట్టుబట్టింది. చనిపోయినా ఆమె ఇష్టాన్ని కాదనలేకపోతున్నాను. ఇప్పటికి 950 బొమ్మలు వేశాను. ఈ బొమ్మలన్నీ బాపు-ముళ్ళపూడి ఎప్పటికప్పుడు చూసి 'బాగున్నా'యన్నవే! స్త్రీలను చిత్రించేటప్పుడు కొంచెం జాగ్రత్తలు తీసుకోమంటాడు బాపు. ఆడవాళ్ళకు యంగ్‌గా కనిపించడం అంటే ఇష్టంట! అలాగే ఎక్కువ గీతలుంటే వారికి నచ్చదంటాడు. ఆ సూచనలు తూ.చ. తప్పక పాటిస్తున్నాను.

## బొమ్మలు-ఆటోగ్రాఫ్‌లు

నేను వేసిన పోర్ట్రయిట్‌ను ఒకటి లామినేట్ చేసి ఆ పోర్ట్రయిట్ ఎవరిదో వారికది కానుకగా అందజేస్తూ అప్పుడే వారి మరో పోర్ట్రయిట్(కాపీ)మీద ఆ వ్యక్తి ఆటోగ్రాఫ్ సేకరించడం నాకు అలవాటు. ఆ అలవాటుతో 150 దాకా ప్రముఖుల ఆటోగ్రాఫులు సేకరించగలిగాను. ప్రముఖ కార్టూనిస్ట్ ఆర్.కె. లక్ష్మణ్ పోర్ట్రయిట్ వేసి వారికి అందజేస్తే ముంబాయి నుంచి రాత్రికి రాత్రి ఫోన్ చేసి నన్నాయన అభినందించారు. క్యారెక్టర్ ఆర్టిస్టు గుమ్మడిగారి బొమ్మ వేసి ఇస్తే దాని కాయన ఆనందించి–

'అయ్యా! నాదింకో బొమ్మ ఉంది. అది కూడా వేసి పెట్టండి' అని అడిగి నన్ను ప్రోత్సహించారు. ప్రముఖ కన్నడ రచయిత యు.వి. అనంతమూర్తిగారయితే నా బొమ్మను 'ఐడిల్'గా పెట్టుకున్నానంటూ నన్ను ఆకాశానికి ఎత్తేశారు. నేపథ్యగాయకుడు బాలుగారయితే తన బొమ్మతో పాటుగా మరో ఇరవై మంది సంగీత కళాకారుల బొమ్మల్ని నా దగ్గర్నుంచి తీసుకుని వారి స్టూడియోలో వాటిని అలంకరించారు. ఒక పక్క ప్రముఖుల ఆటోగ్రాఫులు, మరో పక్క ఆ ప్రముఖుల ప్రశంసలు...ఈ జీవితానికిది చాలనిపిస్తోంది.

### నచ్చినవి

| | |
|---|---|
| పుస్తకం | : అమరావతి కథలు |
| కథ | : అలరాసి పుట్టిల్లు |
| రచయిత | : ముళ్ళపూడి వెంకటరమణ |
| సినిమా | : సీతాకల్యాణం |
| గాయకుడు | : బాలు |
| గాయని | : జానకి |
| మిత్రుడు | : రంగయ్య |
| బంధువు | : ఇంకెవరు? మా బావగారు ముళ్ళపూడి వారే! |
| దైవం | : శ్రీవేంకటేశ్వరస్వామి |

## పుస్తకం వేసి పెట్టండి

హాస్య-సంగీత కళాకారుల రేఖా చిత్రాలతో 'హాస రేఖలు' పేరిట నా పోర్ట్రయిట్స్ కొన్ని పుస్తకరూపంలో వచ్చాయి. ఈ పుస్తకాన్ని హాసం ప్రచురణలు ప్రచురించింది. ఈ సంస్థ వరప్రసాద్ రెడ్డిగారిది. ప్రముఖ పారిశ్రామికవేత్త వరప్రసాద్ రెడ్డిగారి పోర్ట్రయిట్ వేసి వారికి అందజేస్తే...వారది చూసి 'బాగుంది' అని 'మా అమ్మగారిది కూడా వేసివ్వండి' అనడిగారు. ఆనందంగా వేసిచ్చాను. చూసి పొంగిపోయారాయన. ఆ సంతోషంలో 'చెప్పండి! మీకేం కావాలి' అనడిగారు. నా బొమ్మలు కొన్ని పుస్తకరూపంలో వచ్చేట్టుగా సహకరించండి అన్నాను. 'సరే' నన్నారు. బాధ్యతంతా ఎమ్బీయస్ ప్రసాద్‌గారికి అప్పగించారు. ప్రసాద్‌గారు దాన్ని నిండు మనసుతో స్వీకరించి నిర్వర్తించారు. పుస్తకం అద్భుతంగా వచ్చింది. అందుకు వరప్రసాద్ రెడ్డిగారికీ, ఎమ్బీయస్ ప్రసాద్ గారికి నేను జీవితాంతం ఋణపడి ఉన్నానని ఈ సందర్భంగా చెప్పుకుంటున్నాను.

## నాదీ అదే మాట

జీవితంలో బాగా నవ్వుకున్న సంఘటనంటే... బాపు బాగా సినిమాలు చూసేవాడు. వచ్చిన ప్రతి సినిమా చూడడం అన్నయ్యకు అలవాటు. అలా అన్నయ్య సినిమాలు చూస్తోన్న రోజుల్లోనే మా నాన్నగారు పోయారు. పన్నెండు రోజుల పాటు ఎక్కడికీ కదలడానికి వీల్లేకుండా పోయింది. పదమూడో రోజు రాత్రి ఎవరికీ చెప్పకుండా నేను సినిమాకు చెక్కేశాను. ఇంటర్‌వెల్లిచ్చారు. బయటికొచ్చి చూద్దునో... బాపు! సిగరెట్ తాగుతూ కన్పించాడు.

''ఏడుపులు...మొరలు తట్టుకోలేకపోతున్నా! కొంచెం రిలాక్స్ అవుదామని సినిమాకొచ్చాను. సారీ'' అన్నాను.

''నేనూ అదే మాట చెబుతున్నాను. సారీ'' అన్నాడు బాపు. నేను నవ్వును ఆపుకోలేకపోయాను.

## ఆనందం-బ్రహ్మానందం

ఓ మంచి విషయం చెప్పాలంటున్నారు కాబట్టి... ఇంకేం లేదండి! ప్రతి మనిషిలోనూ ఏదో ఒక టాలెంట్ తప్పకుండా ఉంటుంది. దాన్ని మనం ఎప్పటికప్పుడు కల్టివేట్ చేసుకుంటూ పోవాలి. అలా జీవించడంలో ఆనందం ఉంటుంది. దానికి రిటైర్‌మెంట్ ఉండదు. అప్పుడు ఉద్యోగ విరమణ చేశామనే బాధ కాని, భయంకాని ఉండవు. ఈ నిజాన్ని అరవై ఏళ్ళు పైబడిన పెద్దలు తెలుసుకోవడం చాలా అవసరం. తెలుసుకోగలిగితే అదే ఆనందం-బ్రహ్మానందం.

**-జె.ఎస్.**

శంకర నారాయణకు నచ్చిన కథ


# అలరాస పుట్టిల్లు

- కల్యాణ సుందరీ జగన్నాథ్

**అమ్మవారి గుడి పాడుపడి వుంది. తలవాకిళ్లు దుమ్ము, సాలీళ్ళు. మునసబుగారి లోగిలి అరుగులు విరిగి, రాళ్లు బయటపడ్డాయి. అరుగు మీద స్తంభంలోనించి కూడా రాళ్లు వూడిపోయినాయి. లోగిలి సింహద్వారం వద్ద మెట్లు గచ్చుపోయి, రాళ్లు పెల్లగిలిన చోట్లల్లో రావిమొక్కలు చిన్న గడ్డిపరకలూ మొలుచుకొచ్చినాయి. మేడమీద వేసిన కిటికీలకి సాలీడు పట్టింది. భవంతి గోడలన్నీ, నల్లబడి పోయి, అక్కడక్కడా పెచ్చులు రాల్తూ, బీటలు కూడా పడ్డాయి. లోగిలి పెరట్లో ఒక్క నూతి చుట్టు తప్ప అంతా నిలువెత్తు గడ్డి పెరిగి వుంది. నుయ్యి ఒక వేపు కూలింది. ఖాళీ ధాన్యపు గాదులన్నీ పందికొక్కుల కన్నాలు.**

లోగిలికి ప్రక్కగా, వీధి కటుప్రక్క వున్న పెద్ద దొడ్డిలో గడ్డి వాములు వున్న చోట వరిగడ్డి కుళ్లి మోకాటి లోతున పడివుంది. గచ్చు పగిలిన సగం విరిగిన చావడిలో, ఒక మూలన నులక మంచాలూ, విరిగిన గోనె మడత మంచాలు మేటగా పడి వున్నాయి. మరో వేపున తుప్పు పట్టిన నాగటికర్రలూ, కొడవళ్ళూ, గొడ్డళ్లూ, విరిగిన నాగలి కొయ్యలూ, చీకిపోతున్న గోనెలు, పలుపులూ మేటగా పడి వున్నాయి. కట్టుకొయ్యలన్నీ ఖాళీ. పైకప్పు మీద పెంకులు లేచిపోయినయి. చాలా చోట్ల పెద్ద గాలివానకి విరిగిన కొబ్బరి చెట్లు, బాదంచెట్లూ పడినవి పడినట్లే ఎండిపోయినయి. సగం విరిగిన కమ్మరేగు చెట్లు రెండూ విరిగినంతవరకూ తల్లి చెట్టు నించి వేళ్లాడుతూ, అల్లాగే ఎండి పోయినాయి. కుంకుడు బూరగ చెట్ల క్రింద పండాకులు మోకాళ్ల ఎత్తున రాలి ఎండుతూ వున్నాయి. చుట్టూ ఉమ్మెత్త, జిల్లేడి చెట్ల మయం–

పున్నయ్య చెరువు పామంచాలు విరిగి చెరువులోకి ఒరిగి వున్నాయి. వాట్లల్లో కొన్ని పెద్దరాళ్లు మాత్రం కొంచెం దూరంగా పడేసి వూరువాళ్లు బట్టలు ఉతుక్కుంటున్నారు. పొలంలో వున్న పున్నయ్య చిన్నాయమ్మగార్ల సమాధుల సున్నం రాలిపోతోంది. చుట్టూ గడ్డి మొలిచి సమాధుల్ని కప్పుతూంది. సమాధుల మీద రాళ్లు రెండు మూడు చోట్ల వూడి వచ్చేసినయి.



కల్యాణ సుందరీ జగన్నాథ్
రేఖా చిత్రకం

తాడి చెట్లమీద కాకులు గుంపులు గుంపులుగా కూచుని 'కావుకావు'మని కూస్తున్నాయి. లోగిలి వెనక వైపు నించీ తుమ్మచెట్ల మీదుగా సూర్యుడు అస్తమిస్తున్నాడు. ఆ సాయంత్రపు ఎర్రటి ఆకాశం ముందు నల్లగా నిటారుగా మొండి తాడిచెట్టు ఒకటి నించుని వుంది. దానికీ తామర గుంటకీ మధ్య వున్న మంటి దారిలోనుంచి రిక్షా ఒకటి వస్తూంది. తామరగుంట అంతా నాచుతో నిండి వుంది. చుట్టూ బురద పాములు వరసగా తలలు మాత్రమే నీళ్లలో నుంచి బయటికి పెట్టి గాలి పీల్చుకుంటున్నాయి.

ఆ రిక్షా లోగిలి సింహద్వారం దగ్గర ఆగింది. దానిలోనించీ ఒక వృద్ధాప్యం సమీపిస్తున్న ఆవిడ దిగింది చేతిలో ఒక సంచి పట్టుకుని. లోపలినించీ అడుగుల చప్పుడు ఖాళీ భవంతిలో ప్రతి ధ్వనించింది. ఈవిడ కంటె మరికాస్త పెద్ద వయస్సు గల మరో ఆవిడ లోపలనించీ వచ్చింది. ఎండలో వెలిసి, వానల్లో తడిసిన ముఖం. ఈవేళ ఆ ముఖం దుఃఖంగా కూడా వుంది. ''వచ్చేశారు గదా, అక్కమ్మగారూ! మీరు అందుకో లేరేమో అనుకున్నామండీ'' అంది. అక్కమ్మ పవిటకొంగు ముడి విప్పి చిల్లరతీసి రిక్షావాడి కిచ్చాక క్రింద పెట్టి వున్న సంచీ పట్టుకుని చంద్రమ్మ ముందూ, అక్కమ్మ వెనక ఆ శిధిల సోపానాలు ఎక్కి ఆ నిశ్శబ్దాలలోకి వెళ్ళారు. వీధి అరుగు మీద నిశ్చలంగా పడుకుని వున్న మేకపిల్ల బేబే అని అరచి, ప్రక్కనించీ దూకి పారిపోయింది, ఈ మాత్రం అలజడికే.

లోపల కెళుతూంటే, లోపల గుమ్మంలో నుంచీ వ్రేళ్లాడుతున్న సాలీడు అక్కమ్మ ముఖానికి చుట్టుకుంది. ''ఇల్లంతా తుడిశానుమ్మా, ఇంకా బూసు ఇక్కడి వుండిపోయిందన్న మాట. ఈ పెద్ద గవిడి కూడా నేను వచ్చాక తెరిశానుండి, నాలుగు రోజులే అయింది. ఆరు ఈరూ, రావాలిగిందా ఇక ఉప్పుడు అని తెలిసి తెరిసేశాను'' అంది చంద్రమ్మ, అక్కమ్మ సాలీడు తుడుచుకుంటూంటే, ఎత్తయిన స్తంభాల మధ్య చంద్రమ్మ గొంతు 'బొంయ్ బొంయ్' మని మారుమ్రోగింది. ముందర మండువాలో గచ్చు వూడిపోయిన చోటా, బీటలు వారిన చోటా, గడ్డి మొలిచింది. మండువా వసారా అంచల లోనుంచీ రావి మొక్కలూ, మర్రి మొక్కలూ మొల్చుకొచ్చినయి. మండువాలో అడ్డంగా ఒక తొండ ప్రాకుకుంటూ వెళ్ళిపోయింది. ''ఏమన్నా ధారకం దిగుతూందా?'' అంది అక్కమ్మ. నడుస్తూనే విచారంగా, నిమ్మళంగా, ''కొంచం గంజి'' అంది చంద్రమ్మ. ''ఈపాటికి వాళ్ళందరికీ ఉత్తరాలు అందే వుండాలి. వచ్చే సమయం అయింది'' అంది అక్కమ్మ రెండో మండువా దాటుతూ. ఆ మండువా వెనక వసారాలో నులక మంచం మీద ఒక వృద్ధుడు పడుకుని వున్నాడు. పైన మెడవరకూ బూర్నీసు కప్పి వుంది. నేల అంతా అక్కడక్కడ గోతులు పడి వుంది. మంచానికి కొంచెం దూరంలో ప్రక్కవసారాలో పాతదై, తుప్పు పట్టి వూడిపోతున్న ఒక చిలక పంజరం వ్రేళ్లాడుతూంది. అక్కమ్మ మంచం దగ్గర కొంచెం వంగి ''అన్నా!'' అని నిమ్మళంగా పిల్చింది. వృద్ధుడు పలక లేదు. ''ఒక అరగంట నించీ కొంచెం నెమ్మదిగా వుండారమ్మ. మూలుగుడూ అదీ లేదు'' అంది చంద్రమ్మ.

లోపలి గదిలో నుంచీ సుబ్బారాయుడు భార్య వచ్చింది. అడుగులు పట్టి వేసుకుంటూ. ''డాక్టరు ఏమన్నాడు వదినా?'' అంది అక్కమ్మ. ''వచ్చావా అమ్మా, కాళ్ళు కడుక్కున్నావా? ఎవ్వరే మంటారు? ఏం లాభం లేదంట. పేరంటాలయ్య కొడుకు అన్నాడు'' అంది. ''తెల్ల వైద్యం తెలిసిన వాళ్ళని పిలవక పోయావా?' అంది అక్కమ్మ. ''సరే! మందూ వద్దూ, మాకూ వద్దు, డాక్టర్ అసలే వద్దని ఎంత పట్టుపట్టారో చంద్రాయినడుగు. అసలే పట్టుదల మనిషాయె' అంది సుబ్బారా


యుడి భార్య. ''అసలు ఆయన బ్రతుకులో ముందెప్పుడైనా తిన్నారేంటుండి?'' అంది చంద్రమ్మ. అంతలో లోపలి గదుల్లోంచి ఒక చూరు గబ్బిలాయి, గది కడ్డంగా ఎగురుతూ వచ్చి రోగి మంచమూ, ఆడవాళ్ళనీ దాటి, ఇవతల గదుల్లోపలికి వెళ్ళిపోయింది శబ్దం లేకుండా. క్రింద పడివున్న విసనకర్ర అందుకుని కాస్సేపు రోగికి విసిరింది అక్కమ్మ నించుని. ''నేను వంట చేస్తాను. నువ్వు కాస్సేపు గాలికి బైట వీధి అరుగు మీద కూచో, లోపల మరీ ఒంటరిగా వుంటూంది'' అంది సుబ్బారాయుడి భార్య. ''ఎందుకొదినా, నేను చేస్తానులే. నువ్వున్న దగ్గర కూచో'' అంది అక్కమ్మ. ''రేపణ్ణించీ ఎలాగూ చాకిరీ తప్పదు గదమ్మా నీకు'' అంది ఆమె. ''ఉప్పుడెట్టాగా నిద్రోతుండారు గిందా అయ్య, మీరూ అల్చిపోయారు గిందా, కాళ్లు కడుక్కోండి, బయట కూకుందాం'' అంది చంద్రమ్మ.

బయటగోడ నానుకుని అరుగుమీద కూచుంది అక్కమ్మ. చంద్రమ్మ స్తంభాన్ని ఆనుకుని కూచుంది. దూరంగా ఎక్కడ నుంచో ఆవు 'అంబా' అని అరిచింది. ''ఎసువంటి మారాజు! ఎంత మెత్తని గుండెకాయ! ఏం కథ లే'' అంది చంద్రమ్మ తలవొంచుకుని. ''ఒకప్పుడూ మా ఇంటి మడిశి'' అని తల ఎత్తుతూ చెప్పసాగింది. ''నన్ను బాదాడు. ఒక్క పరుగుచ్చుకుని ఇక్కడ కొచ్చి పడ్డా. ఈ మారాజు కూసోని ఉండాడు. నా కింకేం తోసలే! ఆయన రెండు పాదాలు పట్టుకున్నా. మా ఇంటోడు నా యనకాల్తే వచ్చేశాడు బడితుచ్చుకుని. ఈ బాబులేసి ఒక్కటుచ్చుకున్నాడు శంప మీద, ఆ మడిశి ఇంకంతే! రొండు శేతులూ మొకం మీద అదిమి పట్టుకున్నాడు. కళ్ళల్లో నీళ్ళు తిరిగినయి అతగాడికి. నా కడుపాగలే, మల్లా కాళ్ళుచ్చుకున్నా, 'బాబయ్య బాబయ్య కొట్టబోకుండి. ఒదిలెయ్యండి' అని ఏడిశా. ఆయన నా మాట ఇన్నాడో లేదో గాని జేబులో సెయ్యెట్టి, శేతికొచ్చిన రూపాయ లిచ్చేశారు మావోడి దోసిల్లో. మావోడు అన్నాడు గిందా. ''నేను ఉత్తినే కొట్టానే వుండి అయగారూ నేను గొడ్డెల్లె కట్టపడి ఇంటి



కొచ్చేతలికి ఇది కూడు ఒండకుండా ఆ కన్నిగాడితో మాట్లాడతా కూకుంది. ఆడేంటేంటో వూసులు సెపుతున్నాడు – ఇది ఇంటా ఇకిలిత్తా వుంది'' అన్నాడు. అయ్యగారి కళ్ళు శింతనిప్పు అయినయి. 'ఈసారి కన్నిగాడితో మాట్లాడితే, దీన్ని ఒక్క ఏటున నరికెయ్యరా' అన్నారు మా మడిశితో. ఆయన ముఖం సూత్తే అంతబయ్యం ఏసింది నాకు – ఆబయ్యం ఉప్పుడికి వదలలే నాకు. మా నీతిమంతుడుండి ఆయన! కోపం ఉండే ఉండాది గాని, ఎంత కనికారం! ఆయన ఇచ్చిన రూపాయలు పెట్టుకుని కడుపారా, ఇందు చేసుకు తిన్నాం. మావోళ్ళు శానామంది ఇంకా నిలకడ లేకుండా కుప్పలూ గట్రా నలుపుకు తింటా, దొంగతనాలే గిందా! ఇంకా కులవుత్తే గిందా! ఈ మారాజు ముమ్మల్ని పిల్చి పున్నయ్య సెరువు మీద కావిలిగా పెట్టి ఇల్లూ వాకిలీ ఇచ్చేరు. మారాజుకి పువ్వుల ఇమానం వత్తాది. ఎల్లేటప్పుడు... ఆ సెరువు కూడా ఈరి తాతగారు తొవ్వించిందేనంటగా. ఆ తాతగారియేనంటగా ఆ సమాధులు'' అంది కాస్సేపు నిశ్శబ్దం – అంతా.

ఎదురుగా తామరగుంట గట్టు మీద నించీ కప్పలు బెకబెకమని అరుస్తున్నయి. చుట్టూ కీచురాళ్ళు కూస్తున్నయి. కనుచీకటి పడుతూంది. ''ఈ జబ్బు ఫలానా అని



తేల్చిన వైద్యులు లేరు గదా. ఇన్నేళ్ళున్నూ'' అందక్కమ్మ. ''అసలే వైద్దుగుల్ని పలకరిచ్చారు ఆయన? అసలు ఒకళ్ళతో మాట్లాడారా, ఇన్నేళ్ళూ? ఏదో గట్టికాయం గనక ఇట్టా గెంటు కొచ్చారుగా నుండీ!'' అంది చంద్రమ్మ. అక్కమ్మకీ, ఈ లోగిలిలో తను గడిపిన బాల్యం అన్నీ మనస్సులో కొస్తున్నాయి. ''ఈ ఇంటి సిరిసంపద లేమయి పోయినయ్యో చంద్రా! రోజు లెట్లా మారిపోయినయ్యో'' అంది అక్కమ్మ నిమ్మళంగా. ''ఎందుకు సెపుతారమ్మా ఆ సత్తవతమ్మ గారి పెళ్ళి అయింది. లచ్చిమి తొలిగిందే. ఒకేల యేమన్నా శాపమా, గిట్టనోళ్ళు యామన్నా సేసారా అనిపిత్తాది నాకు'' అంది చంద్రమ్మ.

సత్యవతి పేరు ఎత్తేటప్పటికి అక్కమ్మకి మనస్సు బరువెక్కింది. సత్యవతీ అక్కమ్మా కలిసి పెరిగారు. దూరపు బంధువులు, చిన్నబ్రతుకు బ్రతకటం వల్ల అక్కమ్మ తండ్రి వీరయ్య, సుబ్బారాయుడు తండ్రి మునసబు గారిని ఆశ్రయించి లోగిట్లోనే ఉండిపోయాడు సకుటుంబంగా. తల్లి లేని సత్యవతికి పాలిచ్చింది అక్కమ్మ తల్లి. బ్రతికి ఉన్ననాళ్లూ లోగిలి సువ్వారాలన్నీ ఆవిడే నిర్వహించింది. అక్కమ్మకీ, సత్యవతికీ బలీయమైన స్నేహం, ఇద్దరికీ మరుగులు లేవు. ప్రాణ స్నేహితురాళ్ళు కూడాను.

చంద్రమ్మ లాంతరు వెలిగించుకు రావడానికి లోపలి కెళ్లింది. అక్కమ్మ మనస్సులో జ్ఞాపకాలు కదిలినయి బాధతో, సుమారు నలభై ఏండ్ల క్రితం జరిగిన గాథ అదంతా.

సుబ్బారాయుడు తరుణప్రాయంలో అది.

నెల పొడిచింది – రాత్రి రెండు జాములయింది. ప్రపంచం పగటి వేసవి తాపం అంతా మరిచి నిద్రపోతూంది.

తన మామూలు ప్రకారం లేచి చేతిలో హరికేను లాంతరు పట్టుకుని గొడ్ల చావిడి అంతా కలియచూచి, ధాన్యపు కొట్ల తాళాలు లాగి చూచి, వాకిట్లో ధాన్యం గరిసెల చుట్టూ తిరిగి వచ్చి, మండువాలో మంచం మీద పండుకోబోతున్నాడు సుబ్బారాయుడు. ముందరి వాకిట్లో ధాన్యం పాతర మీద వరి గడ్డి మీద చాపలు పరచి పండుకున్న చింతాలూ, నల్లిగాడు పెట్టే గుర్రు తప్ప అంతా నిశ్శబ్దం. ఒక్కసారి చిన్నగాలి గట్టిగా విసిరింది – ఇంటి ముందర తామరగుంట మీద నించీ, పెద్ద గుమ్మానికి కట్టి వున్న కొంచంగా ఎండిన మామిడాకుల తోరణాలు ఆ చిరుగాలికి 'గలగల' మన్నయి. ఎక్కడో చిన్న అడుగుల చప్పుడైంది. పండుకోబోయే సుబ్బారాయుడు తిరిగి లేచి కూచున్నాడు. మరి కాస్త ఆలకించాడు. అవును. అడుగులే! అడుగులు ముందరి వాకిట్లోకి వస్తున్నాయి – ధాన్యం పాతర వద్దకే లాగుంది. గరిసెల సుమారున ఆగినట్టుగ వున్నాయి. వూళ్లో దొంగల ముఠాలు తిరుగుతున్నట్టు వినికిడి. సుబ్బారాయుడు బస్తాలమీద వున్న వెండి పొన్ను కర్ర చేత పట్టుకుని తెరిచి వున్న వాకిలి లోంచి బయటకొచ్చాడు. గరిసె దగ్గర ఎవ్వరూ లేరు.

ఒక్కసారి గొంతు సవరించుకుని ''ఎవ్వరదీ'' అన్నాడు ధృడంగా. ఎవ్వరూ పలకలే. మళ్ళీ పిలిచాడు. అంతా నిశ్శబ్దం. కాని గరిసెకి అవతల ప్రక్కగా, గాలికి బట్ట రెపరెప కొట్టుకుంది. సుబ్బారాయుడు ధైర్యం చేసుకుని గరిసెకి అవతల ప్రక్కగా వెళ్ళాడు. ''ఎవ్వరది?'' వాడిన పువ్వుల వాసన కొట్టింది. ఆ ప్రక్క వేపచెట్టు నీడ బడుతూంది. ఆ నీడలో మసక వెన్నెలలో ఒక స్త్రీ రెండు చేతులతోనూ ముఖం అంతా కప్పుకుని వుంది. ఈసారి ''ఎవరు నీవు'' అని గర్జించాడు. బదులు లేదు. కాని ఆ అరుపుకి, ఇంటికి దూరంగా మొండి తాడిచెట్టుకి రెండు పలుపులతో కట్టేసిన కారుదున్న ఒకటి తలకాయ క్రిందకి చాపి హు! హు! అని అరచి ముందరి కాలుతో కోపంగా నేలని వెనక్కి త్రవ్వింది నాలుగైదుసార్లు. బండెడు దుమ్ము లేచింది. పలుపు తెంపుకోవ డానికి ప్రయత్నించింది. సుబ్బారాయుడు అక్కడే ఆగాడు – ఒక్క క్షణం. ఆ స్త్రీని పరకాయించి చూశాడు. ఆవిడ తల్లో వాడిన ఎర్ర బంతి పువ్వు, బొగడా చెండూ ఆ మసక వెన్నెలలో కొంచెం నల్లగా కనిపించినయి, ఇంకా దగ్గరగా వచ్చాడు. సుబ్బారాయుడికి అనేక తలంపులు ఒక్కసారిగా వచ్చాయి.

''సత్యవతీ!'' అన్నాడు.

''అన్నా!..... నేను'' సత్యవతి దీనస్వరం వినేటప్పటికి సుబ్బారాయుడికి మనస్సు కరిగిపోయింది. వెంటనే భయం కూడా కలిగింది.

''కూడా వచ్చిందెవరు?'' అన్నాడు. సత్యవతి మాట్లాడలేదు. ఇంత అర్థరాత్రి సత్యవతి ఎందు కొచ్చింది? ఎల్లా వచ్చింది? ఏ మాపద కలిగిందో? ఏ మాపద కలుగుతంది.

పెండ్లి అయ్యి రెండు వారాలే గదా అయింది. పందిరైనా విప్పలేదే! ఎంత ఆపద అయితే మాత్రం అర్ధరాత్రి పూట, ఆడకూతురు ఇల్లు విడిచి నడిచిరావ

డమూ – ఇంత దూరం! అందులోనూ అత్తవారిల్లు విడిచి పుట్టింటికి. ఏమీ అఘాయిత్యం! భూమి పుట్టినప్పటినించీ ఈ ఇంట్లో ఆడ వాళ్ళు ఇట్లా చేశారా? అట్లాని ప్రపంచంలో ఎవ్వరైనా విన్నారా! రేపు ప్రొద్దున్న నలుగురిలో తల ఎత్తుకోవడం ఎట్లా? సుబ్బారాయుడు కోపం ఆపుకుని "లోపలికి రా" అన్నాడు. అన్నా చెల్లెలూ ఎదురుపడి మాట్లాడుకోడం అరుదు – అందులోనూ అతను పెద్దవాడైన తరువాత, అసలు ఆ మాటకొస్తే, పెద్దన్నగారితో అతని ఆరుగురు తమ్ములూ బదులు మాట్లాడరు. పిలవకుండా ఎదురుగా రారు. అతను చావిట్లో వున్నంత సేపూ ఆడ పిల్లల గొంతులు బయట ఆ ప్రాంతాల్లో వినిపించవు. పైగా పెద్దబ్బాయంటే తండ్రి మునసబుగారికే ఆదొక మోస్తరు.

సత్యవతి ఆడవాళ్ళంతా పడుకున్న రెండో మండువాలోకి వెళ్లింది. మండువాలో తూర్పున వసారాలో సత్యవతి గది ముందు వ్రేళ్లాడగట్టిన పంజరంలో నించీ చిలుక సత్యవతిని చూడంగానే పాట మొదలెట్టింది కీచు గొంతులో–

"వచ్చేవు పోయేవు ఓ రామ చిలుకా
అలరాస పుట్టిళ్ళు లా వార్తలేమి?
పట్టు చీరలు కొన్నారు పణతి మీ యన్నలు
వనిత మీ యన్నలూ వచ్చుచున్నారు"

నడిరేయి ఈ సందడికి పండుకున్న వదినెలు లేచారు. "ఇదేమీ ఆగడమమ్మా, ఎప్పుడూ ఎరగం ఈ విచిత్రం. పేరూ, ప్రతిష్టలూ, మన్నుగలిశాయి" అన్నారు. "నలుగురు నోళ్ళల్లో వేస్తావుంది నాయనా ఈ ఇంటిని. మిగతా ఆడపిల్లలికి పెళ్ళిళ్ళు ఎట్లా అవుతాయి ఇక?" అంది సత్యవతి మారుతల్లి ప్రక్కమీద లేచి కూచుని విసెనకర్ర చేత్తో అందుకుంటూ. ఈ మాటలకి మారుటి చెల్లెళ్లూ నలుగురూ లేచారు, ఆవలిస్తూ విరుచుకుంటూను. సవతి తల్లి చావిట్లో పెద్ద మంచం మీద పడుకున్న మనసబుగారి చెవిలో, అప్పటికప్పుడే వెళ్ళి వూదేసింది. ఆయన ప్రక్కగానే మడత మంచం మీద పడుకున్న వీరయ్యా లేచాడు దిగ్గున, ప్రక్కన వున్న తువ్వాలుతో మెడ చెమట తుడుచుకుంటూ. పై మేడ మీద పడుకున్న మునసబు గారి కొడుకులందరికీ కూడా తెలిసింది. ఆ రాత్రి ఇక మునసబు గారి ఇంట ఎవ్వరూ నిద్రపోలేదు.

అక్కమ్మ వచ్చింది సత్యవతి గదిలోకి. అక్కమ్మని చూచి కళ్ళు తుడుచుకుంది సత్యవతి. అక్కమ్మ తలుపు జారగిలవేసి దగ్గిరగావచ్చి కూచుంది. "బయటదారులన్నీ దొంగలు తిరుగుతున్నారంట. ఎట్టా రాగలిగేవు సత్యవతీ?" అంది. "ఇవిగో అందెలూ, కడియాలూ దారాలతో కట్టాను మోగకుండా. మిగతా నగలన్నీ తీసేసి వాళ్ళింట్లోనే పడేశాను" అంది సత్యవతి తలవంచుకుని. కొంచెం సేపూ ఇద్దరూ మౌనం. "ఏమయిందీ?" అడిగింది అక్కమ్మ. సత్యవతి ఇంకా తలవంచుకుంది. "నిన్న సాయంత్రం నన్ను బలవంతంగా ముస్తాబు చేశారు. పడకటింటి వేపు తొంగి చూడనైనా చూడకుండా నేను పారిపోయి వచ్చేశాను." అక్కమ్మ, తన పవిట కొంగుతో సత్యవతి కళ్ళు అద్దింది, "యేటికి ఎదురీదడం కష్టం సత్యవతీ" అంటూ.


మరునాడు మధ్యాహ్నం వేళకల్లా అత్తవారి పాలేరు వచ్చాడు.

చింతాలు సవ్వారి బండి కట్టాడు. వీరయ్యా, అక్కమ్మా సత్యవతి వెంట దిగబెట్టడానికి బయలు దేరారు – అత్తవారి ఇంటోరు.

"అసలు ఆడదానికి ఇష్టమూ, అయిష్టమూ ఏంటి?" అంది సవితి తల్లి. "పరువు ప్రతిష్టలు గల కొంప బయటికీడ్చుకు తల్లీ?" అన్నారు మునసబుగారు, నిమ్మళంగా దగ్గుతూ. "తిరిగి వచ్చావా, గడప కడ్డంగా నరికేస్తాను" అన్నాడు కోపంగా సుబ్బారాయుడు.

బండిలో ఎవ్వరూ పైకి మాట్లాడలేదు. తన కష్టాలన్నీ మనస్సులో తలపోసుకుంది సత్యవతి. ఒక వారం దినాలకి ముందు ఇల్లాగే చడీచప్పుడూ లేకుండా అత్తవారి ఇంట్లో నుంచీ చీకటి కడ్డం పడ్డది. ఎక్కడా మనుష్య సంచారం లేదు. పండిన చేల ప్రక్కనించీ బళ్ళదారిని నడిచింది. కొంతదూరం వచ్చేసరికి వెన్నెల వచ్చింది. ఎంత దూరం చూచినా వెన్నెల వెలుగులో అనంతంగా పొలాలు తప్ప మానవుడు కనిపించలే. పొలాల్లో ఎక్కడో ఒక నక్క అరుస్తూ పరుగెట్టింది. తన కాళ్ళ అడుగుల చప్పుడు తనకే పెద్దగా వినిపించి, ఆఖరికి గోనలేరు దగ్గిరికి వచ్చింది – అడ్డదారిని. వేసవిలో ఏరు ఎండి నీళ్ళు నడుము వరకే వస్తాయి. ఏరు శాంతంగా ప్రవహిస్తుంది. అలల మీద చంద్రుడు మెరుస్తున్నాడు. కాని వెంటనే భయం వేసింది. నీళ్లలో కాలు పెట్టబుద్ధి కాలేదు – ఒంటరిగా, తన చిన్నతనపు భయం ఇంకా వుండిపోయింది. ఈ గోనలేట్లోనే చాలా భయపడ్డది ఒకసారి బాల్యంలో. మూడు రోజులు జ్వరం కూడా వచ్చింది. అప్పుడు ఒకనాడు రోహిణి కార్తె ఎండలకి,

## ఈ కథ ఎందుకు నచ్చిందంటే...



నాకు బాపు, రమణగారిలాగా పుస్తకాలు చదివే అలవాటు పెద్దగా లేదు. కాకపోతే పదిమందీ బాగున్నాయన్న పుస్తకాలు కొన్ని చదివాను. ఆ చదివినవన్నీ కథా సంకలనాలే! అందులో ముందుగా నాకు 'అమరావతి కథలు' నచ్చాయి. తర్వాత కల్యాణ సుందరీ జగన్నాథ్ గారి కథ 'అలరాస పుట్టిళ్లు' నచ్చింది. ఈ కథ ఎందుకు నచ్చిందంటే...ప్రేమ గొప్పదని ఇందులో చెప్పుకొచ్చారు. ఆ ప్రేమ ఎంత గొప్పదో మా పెద్దమ్మాయి వర ముళ్ళపూడిని ప్రేమించినప్పుడు తెలిసింది. రెండో అమ్మాయి ఓ క్రిస్టియన్ కుర్రాణ్ణి ప్రేమించినప్పుడు ఇంకా బాగా తెలిసింది. నేను సరే, వారి ప్రేమను మా అమ్మగారు కూడా ఒప్పుకుని 'కులాలు, మతాలు కాదురా! మనసులు ముఖ్యం. మారు మాటాడకుండా ఇద్దరికీ పెళ్ళి చెయ్యండి' అంది. చేశాను. మా అబ్బాయి తుళు అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. పిల్లలందరూ బాగున్నారు. ప్రేమించడం తప్పుకాదు, ఆ ప్రేమను పెద్దలు కాదనడమే తప్పు. పాపం కూడా. ఆ పాపానికి తగిన శిక్ష ఎలాంటిదో పాఠకులకు ఈ 'అలరాస పుట్టిళ్ల'లో కనిపిస్తుంది. ముగింపు మనసుని కుదిపేస్తుంది. అందుకు నచ్చింది కథ


**ఎస్. శంకరనారాయణ**

భూమి మాడి మాడి వుంది. ఆనాడు మృగశిరకార్తె వచ్చిన క్రొత్త. కాలవలు వదిలే రోజులు. ఎవ్వరూ చూడకుండా అక్కమ్మా తనూ ఆ యేట్లో దిగారు ఒడ్డున ఆడు కోడానికి. ఇంకా దిగువని, ప్రక్కవూరి పిల్లలు, తడి ఇసుక ముద్దలు మీద జల్లుకుంటూ ఆడుకుంటూన్నారు. కాలువకి ఎగువ నించీ క్రొత్త నీళ్ళు వస్తున్నాయి. నీళ్లు ఎవళ్లూ చూడలేదు. నీళ్ళు చిక్కగా ఎర్రగా బురదతో నురగలతో పొర్లుకుంటూ వస్తూన్నాయి. వీళ్ళని దాటుకుంటూ పోతున్నాయి. పిల్లలు కాస్త ఇంకో ఒడ్డుకి తప్పుకున్నారు. చెట్ల మొద్దులూ, విరిగిన పచ్చిచెట్ల కొమ్మలూ అన్నీ నీళ్లలో కొట్టుకొస్తూన్నాయి. ఒడ్డుకి తప్పుకోబోతున్న సత్యవతికి ఒక ముళ్ళ కంప నీళ్ళలో గీచుకు పోయింది. ఆ గాయాలు తడుముకుని, తల పైకెత్తే లోపుగా నీళ్లలో ఒక ఆడ మనిషి చెయ్యి కనిపించింది. గాజులతో సహా ఆ చేతి ప్రక్కనే నల్లటి జుట్టూ నీళ్ళ మీద సగం మునిగి సగం తేలీ చేతితో సహా ప్రవాహ వేగంలో, యేటి మధ్య నుంచీ వెళ్ళిపోయింది. క్షణంలో కళ్ళముందు, ఆ శవం, ప్రవాహవేగమూ, ఇప్పుడు జ్ఞాపకం వచ్చి ముచ్చెమటలు పోసినయి. కాళ్ళు శక్తిహీనమై, ముడతలు బడ్డాయి. ఒక నిముషానికి ధైర్యం తెచ్చుకుని, కాళ్ళు నిలద్రొక్కుకుని వచ్చిన దారినే వెనకకి తిరిగింది – వెనక్కి చూడకుండా గబగబా నడిచింది. అత్తగారు అప్పుడే లేచి పెరట్లోకి వెళ్ళి వస్తూందనుకుని "ఒంటరిగా ఎందుకు లేచి వెళ్లా" వంది.

ఈ ఆలోచనలూ, భయాలతో అత్తవారిల్లు సమీపిస్తుంది – బండికీ – బండిలో సత్యవతికీ.

ఇక్కడ పాలూరులో బండి వెళ్తున్న దారే చూస్తూ నిలబడ్డాడు సుబ్బారాయుడు. బండి పది బారలు పోయాక వెనక్కి తిరిగాడు – లోగిలి వేపు. అరుగు మీద కూచుని అరుగు క్రింద వున్న పెంపుడు లేళ్ళు గౌరి, రాజాలకి లేతగడ్డి మేపుతున్నాడు. లోపలి నుంచీ కొండలయ్య వచ్చాడు. అమ్మవారి కొలువుల ఖర్చుల వివరాలకి, ఉత్సవాలకి ప్రభలకి అయ్యే రొక్కం విషయం అంతా మాట్లాడి, ఇనుప పెట్టి తాళం తీసుకుని లోపలికి వెళ్ళాడు. కొండలయ్య దూరపు మేనల్లుడు, ఆశ్రితుడు కూడాను మునసబు గారికి. ఈ వ్యవహారాలన్నీ చూచే బాధ్యత ఈ మధ్యనే సుబ్బారాయుడు తలమీద పడ్డది. మునసబుగారి వయస్సు క్రుంగిన తరువాత ఈ నిర్వహణ అంతా చెంగల్వరాయుడు మోశాడు. అతని పేరు జ్ఞాపకం రాగానే కొంచెం కళ్లెర్రనైనాయి. "ఏమీ అభిమానం! వెళ్ళేటప్పుడు డబ్బిస్తే పుచ్చుకోలే! వద్దంట!" ఇంకా ఇంట్లోనే వుంటే ఇంకా ముదురును వ్యవహారం. ఎందుకైనా మంచిది పంపించెయ్యడం! ఇంకా నయం ఇంతగల ఇంటికీ ఎంత అప్రతిష్ట – బయట ఎక్కడైనా – ఏమన్నా మాట పుట్టుకొచ్చిందంటే! ఇక చావాలిసిందే.

చేతిలో గడ్డి అయిపోయింది. అరుగుదూకి చావిట్లోకి వెళ్ళి కొయ్య పడక కుర్చీలో కూర్చుని లంక పుగాకు చుట్ట చుట్టుకుంటున్నాడు. మనసు కొంచెంగా కుదుటబడుతూంది. గుమ్మం ముందర నించీ గవిడిపోతుల్నీ బీడుకు తీసుకెళుతు




న్నాడు నల్లిగాడు. సుబ్బారాయుడు ''ఒరే నల్లిగా నెమళ్ళకి మేత పెట్టావ్రా?'' అని అరిచాడు. అతని గొంతు వినగానే, జతలో ఒక కారుదున్న హు! హు! అని కొమ్ములు పైకి నెట్టి, తల నేలకి వంచి ముందర కాళ్ళతో వెనక్కి నేల దువ్వడం ఆరంభించింది – పలుపులు త్రెంచుకోడానికి ప్రయత్నిస్తూ. మిగతా పాలేళ్ళు కూడా పరుగెత్తుకుంటూ వచ్చి, పలుపులు బలంగా లాగి తీసుకుపోయారు మేతకి. నల్లిగాడి వల్ల ఒక్కడి వల్ల కాలేదు దున్నపోతుని ఆపడం. అతను ఉన్నంత కాలమూ, అతను ఒక్కడు ఆ దున్నను అదుపులో పెట్టగలిగేవాడే, ఇప్పుడు నలుగురు కావలసి వచ్చారు. తిరిగి చెంగల్వరాయుడే గుర్తుకొచ్చాడు సుబ్బారాయుడికి. మనిషి ఏమంత వీళ్ళందరికంటె బలాఢ్యుడేమీ కాదు. కాని అదేమి మాయో ''దా దా'' అంటూ అతను దగ్గరికి వెళ్ళే సరికల్లా ఆ పాపిష్టిదున్న తల పైకెత్తి కాళ్లు దువ్వటం ఆపేసి పసిపిల్ల చూచినట్లు చూచేది.

సుబ్బారాయుడు లేచి గొడ్లచావిడి ఉన్న పెద్దదొడ్లోకి వెళ్లాడు. దొడ్లో వరిగడ్డి మేటుల్లో గడ్డి మీదేసుకుని ఆటలాడుకుంటున్న పాలేళ్ళ పిల్లలందరూ ఎక్కడ వాళ్ళక్కడ మీద వున్న వరి గడ్డి కదల నీయకుండా గప్‌చిప్‌గా ఉండి పోయారు. సుబ్బారాయుడు వెనక చేతులు కట్టుకుని తలవంచుకుని ఆలోచనగా, నిమ్మళంగా అడుగులు వేస్తూ ఇంకా దొడ్డి లోపలికి వెళ్ళాడు. పందెపు కోడి పుంజులకి తవుడు కలిపి పెడుతున్న చిన్నపాలేళ్లు లేచి నుంచున్నారు. కాని సుబ్బారాయుడు అక్కడ కూడా ఆగకుండా ఇంకా వెళ్లాడు. చిన్నచావిట్లో ఏడు సంవత్సరాలు చెంగల్వరాయుడు పడుకున్న మడత మంచం జారవేసి వుంది. చావిట్లో ఒక ప్రక్క కప్పుకుంటూ పేర్చిన తుమ్మ మొద్దులు సరుకు మొద్దులు ఉన్నాయి సువ్వారాలకి. పెద్ద గొడ్ల చావిట్లో ఆరు లేగలు మూతులకి చిక్కాలు కట్టుకుని పండుకుని వున్నాయి. నాలుగు ముసలి యెద్దులు కట్టుకొయ్యల వద్ద పండుకొని నిమ్మళంగా నెమరు వేస్తున్నాయ్, లేవలేక రోజులు లెక్క పెట్టుకుంటున్నట్టుగా ఉన్న పెద్ద యెద్దు వీపు మీద జోరీగని చేత్తో కొట్టేశాడు. ఎద్దు తృప్తిగా ఎత్తలేక ఎత్తలేక తల పైకెత్తి చూచింది. ఆ కట్టుకొయ్యల దగ్గిరినించీ, పావురాయి గూళ్ళ దగ్గరకెళ్ళి పావురాలని బయటకి తీసి, ఒక్కొక్కటే ఎగరవేశాడు. పావురాలు కాళ్ళ అందెల రవళితో గలగలమంటూ ఆకాశంలోకి గుంపుగా ఎగిరి మొగ్గలేస్తున్నాయి. సుబ్బారాయుడు ఒక తుమ్మమొద్దు మీద కాళ్లు దగ్గరగా తీసుకుని కూచున్నాడు, తృప్తిగా చుట్ట పీలుస్తూ. పాలేరు ఒక బుట్టెడు పెసలు పావురాల మేత కోసం తెచ్చి అతని కాళ్ళ వద్ద పెట్టి వెళ్ళిపోయాడు. ''ఛఛ పేరూ ప్రతిష్ఠ! ఈసారి తిరిగి రానియ్యి చెబుతా!'' అన్నాడు తనకు తానే పండ్లు బిగించి, కనుబొమ్మలు చిట్లించి.

***

అక్కమ్మ మనస్సులో ఈ గాథ ఇంకా నడుస్తూనే వుంది. పైకి మాత్రం ఏమీ మాట్లాడడం లేదు. చంద్రమ్మ కూడా మాట్లాడకుండా కూచునేవుంది. ఇద్దరి మధ్యా లాంతరు వెలుగుతూంది. దూరాన కుక్కలు మొరిగినయి. తామర గుంటలో కప్పలు ఇంకా పెద్దగా అరుస్తున్నయి, ఇంకో రిక్షా వచ్చి ఆగింది గుమ్మం ముందు. సుబ్బరాయుడి మూడో తమ్ముడూ, అతని భార్యా, మనమడూ వచ్చారు. వాళ్ళను తీసుకుని – లాంతరు చూపిస్తూ, అక్కమ్మ, చంద్రమ్మా లోపలికి వెళ్ళారు.

''అన్నా... అన్నా ఇదిగో చూడు. కళ్ల తెరువు. చిన్నన్న వచ్చాడు'' అంది అక్కమ్మ సుబ్బారాయుడు నుదురు మీద చెయ్యవేస్తూ ''ఎవరు నువ్వు? సత్యవతా?.... ఆ!'' అంటూ కళ్లు కొంచెం తెరిచి చూచి ''నీవా అక్కమ్మా వచ్చావా?'' అన్నాడు. ''ఆ వచ్చానన్నా''. ''సత్యవతి ఏదీ? ఇంకా రాలే'' కొంచెం ఆయాసంగా అడిగాడు. అక్కమ్మ కళ్ళు తుడుచుకుంటూ, ఒక చాప పరిచింది. వచ్చిన వదిన గారిని కూచోమంటూ, చంద్రమ్మ గోడకి ఆనించి వున్న బెంచీ మీద, దుమ్ము దులిపి చిన్నన్న గార్నీ మనుమణ్ణీ కూచో బెట్టింది.

మళ్లా బయటకొస్తూంటే మండువా వసారాలో తగిలించి వున్న పాత చిలక పంజరం అక్కమ్మ తలకి తగిలింది. చిలుకలేదు. పంజరం మాత్రమే ఉంది. ఆ చిలుకమీద చెంగల్వరాయుడు జ్ఞాపకం వచ్చాడు తిరిగి వచ్చి బయట అరుగు మీద కూచుని వున్న అక్కమ్మకు. పంజరాన్ని చూడక పోయినా జ్ఞాపకం రాక తప్పదు. అతను పుట్టిందెక్కడ? వచ్చిందెక్కడికి? ఈ లోగిలి సిరి సంపదలతో, అతని బ్రతుకు పెనవేసుకుపోయింది. విధి నిర్ణయాలు, భగవల్లీలలు, ఎంత విచిత్రం! ''ఆ చెంగయ్య ఎక్కడున్నాడో పాపం! సత్తవతమ్మ గారిని తల్చుకొంటే ఆయన మతి కొత్తారుండి... అయినా మా దొడ్డ మడిశండి. వూరంతా అట్టుడికినట్టూ ఉడికింది గిందా!'' అంది చంద్రమ్మ సగం పైకి వినబడుతూ సగం తనలో తానే. ఎదురుగా స్తంభాన్ని అనుకుని కూచుని తల గోడకి చేరవేసి కూచున్న అక్కమ్మకి మరికొన్ని గడిచిన దృశ్యాలు మనసులో మెదిలాయి.

***

అప్పుడు సుబ్బారాయుడికి మంచి ప్రాయం. సత్యవతి గాలిలో పువ్వు ఎగిరినట్టూ, బంగారు జడ కుచ్చులతో కాళ్ళ గజ్జెలతో, తోడాలతో చేతి కంకణాలతో, లోగిలి ఆవరణంతా ఎగిరి, ఆడుతుండేది – ఎనిమిది సంవత్సరాల వయస్సు.

చెంగల్వరాయుడు వచ్చింది ఒక ఉదయం. చేతిమీద బాగా గీసుకుపోయిన గాయాలున్నాయి. పచ్చిరక్తం చారికలున్నాయి చేతిమీద. చెయ్యి కొంచెం పైకెత్తి పెట్టుకున్నాడు. ప్రక్కన ఇంకా బండ్ల వాళ్లు నుంచుని వున్నారు మునసబుగారింటి చావిట్లో. మునసబు గారు మంచం మీద కూర్చుని వున్నారు. సుబ్బారాయుడు వచ్చి పడకకుర్చీలో కూచున్నాడు. ఒక బండీవాడు చెబుతూ వున్నాడు. ''ఇందా

కుండీ, పొద్దుటేల చెరువు ప్రక్క నుండీ, ఈయనగారు చెట్టెక్కారుండీ, వణ్ణం చేసుకోడానికి – ఎండు కొమ్మలగ పడతా వుండాయి పైన. ఆయనేమో చెరువులో తపేలాతో నీలు ముంచాడుండీ. ఈయనగారి తండ్రి – మా ముసిలాయన లెండి. ఒడ్డుకు చేరాడండి. అంతే! ''రామా'' అన్నాడు నేల మీద కూలబడి పోయాడు. మరి ఏమన్నా పురుగే ముట్టిందే ఏమోనండి. మేమంతా దగ్గరికి, లగెత్తేతలికి, ఈయనగారు చెట్టుమీద నుంచి కిందకి గాబరాగా దూకబోయా డుండి. చెట్టు మీద ఎండిన కొమ్మ ఒకటి ఇరిగి చేతిమీదనించీ చీరకు పోయిందదండీ. సూడండి ఈ నెత్తురు, మామంచోరుండీ. ఇదుగో ప్రక్క ఇంటోరిని అడిగామండీ, కామందులు పొలంలో కెల్లారు కాస్త ఆగమన్నారుండి. తమరు దయచేయించాలుండి తెచ్చిన దాన్నెం తెచ్చినట్టుగానే ఉండాది, రొక్కం లేకపాయె, ఏదో ఇంటికో పువ్వేత్తే ఈస్సరుడికి ఒక మాలన్నారు కదాండి'' అంతవరకూ మౌనంగా వున్న సుబ్బారాయుడు ''అట్టాంటిదేమీ అక్కరలేదు. అంతా మేమే చూస్తాం. ఇంకోళ్ళ ప్రసక్తి ఏంటి, అక్కర్లేదు, మనకి అలవాటు లేదు'' అన్నాడు కఠినంగా.

అంతవరకూ ఏదోమైకంలో వున్న చెంగల్వరాయుడు ''ధాన్యం ధరకట్టి మీరే తీసుకోండి'' అన్నాడు సుబ్బారాయుణ్ణి. సుబ్బారాయుడు కొంచెం వెటకారంగా చిరునవ్వు నవ్వాడు. చిన్నగా ''నీ పేరబ్బాయి?'' అడిగారు మునసబుగారు. ''ఇనుగంటి చెంగల్వరాయుడండీ'' ''ఇనుగంటా?'' అన్నారు మునసబుగారు తిరిగి ప్రశార్థకంగా. ''మా వూర్లో ఈరిని ఎరగనోళ్ళంటూ లేరుండి. బాగా బతికిన మారాజులేనుండీ. తమరికేమన్నా బందుగులేవోనుండీ, సుట్టరికాలు తిరగేత్తే'' అన్నాడు కూడా వున్న బండివాడు. ''కాదు కాదు'' అన్నాడు. పడక కుర్చీలోనించి సుబ్బారాయుడు – కత్తిలా. చెంగల్వరాయుడు చటుక్కున తల పైకెత్తాడు. నల్లటి గిరజాలు ముందర కళ్ళల్లో నించీ వెనక్కిచెదిరినయి. ''ఇనుగంటారు అన్నపేరు ఎక్కడో విన్నట్టుగా వుందే'' అన్నారు మునసబు గారు. లోపలినుంచీ ఆటల్లో వగర్చుకుంటూ అప్పుడే గుమ్మంలోకి వచ్చిన సత్యవతి అతన్ని చూచి అట్టే ఆగి పోయింది. మౌనంలో మాట లాగు అతని ముఖంలో ఆగివున్న దుఃఖాన్ని చూచి, చైతన్యం లేనట్టు అయిపోయింది. చెంగల్వరాయుడు ఒక్క క్షణం సజీవంగా చూచాడు – సత్యవతి కేసి.

''తోబుట్టువులూ, అన్నదమ్ములూ ఎంతమంది?'' అన్నారు మునసబుగారు. ''ఈయన ఒక్కడే సంతుండి. కొంద్రగత్రా ఏమీ లేదు. ఉప్పుడు అంతా పోయింది. ఒట్టి కౌళ్ళకే చేత్తా వుండారు. ఇటు పక్క బత్తీలో, మరి కాసిని రాళ్ళు గిట్టుబాటు అవుతయ్యాన్నారు. అందుకని మాతోపాటు ఆయనా బండి కట్టుకొచ్చారుండి'' అన్నాడు వెంట వున్న మరొక బండివాడు. ఈ లోపుగా సత్యవతి తడిసిన గుడ్డ ఒకటి తీసుకొచ్చి గుమ్మంలోనించి చెయ్యి చాపింది. ఎవ్వరూ అందుకోలేదు. సుబ్బారాయుడు ''సత్యవతీ! ఏంటది!'' అని గర్జించాడు. గుమ్మం మీదనే ఆ గుడ్డ పెట్టి సత్యవతి వెనక్కి పారిపోయింది. రెండంగలలో చెంగల్వరాయుడు ఆ గుడ్డ అందుకుని చేతినున్న రక్తపు చారికలు తుడుచుకున్నాడు.

తబిశీళ్ళన్నీ తెలుసుకున్న మీదట ''ఇక్కడే ఉండిపో అబ్బాయీ పాపం! మంచీ చెడూ అంతా మేమే చూస్తాంలే, భయం లేదు'' అన్నారు మునసబుగారు.

చనిపోయిన తన తండ్రికి దహన సంస్కారాలు అన్నీ మునసబుగారే చేయించారు, లోగిట్లో. ఆ ధాన్యం అమ్మించి, ఆ రొక్కం దగ్గరే ఉంచుకోమన్నారు చెంగల్వరాయుణ్ణి.

ఆ నాటి నుంచీ మునసబుగారికి కుడిభుజం లాగా మునసబుగారి లోగిట్లోనే ఉండిపోయాడు చెంగల్వరాయుడు.

చెంగల్వరాయుణ్ణి చూచినప్పటి నుంచీ సత్యవతికీ కన్నతల్లి తిరిగి లేచి వచ్చినట్టుండేది. పొలం వెళ్ళినా, బయటికెళ్ళినా సత్యవతి కిష్టమైనదేదైనా ఒకటితెచ్చి ఇచ్చేవాడు, చెంగల్వరాయుడు. సత్యవతి జ్వరం పడిలేస్తే సోలెడు గుమ్మపాలు తెచ్చి సత్యవతి మంచం దగ్గర స్వయంగా పెట్టే వాడు. ఎవ్వరైనా అడిగితే, గుమ్మపాలు వంటికి మంచిదమ్మా అని సమాధానం ఇచ్చేవాడు. రోజులు గడుస్తున్నాయి.

సత్యవతి పెద్దదయింది. గడప దాటనివ్వడం లేదు, ఇంట్లో పెద్దవాళ్ళూ, సంప్రదాయమున్నూ. కాని సత్యవతికి మాత్రం చెంగల్వరాయుణ్ణి తల్చినంతనే దేవగానం వినిపించినట్టుండేది. అతను ఎదుట ఉన్నంతసేపూ తన ముఖానికి వన్నెలు వచ్చేవి.

ఒకనాడు చెంగల్వరాయుడు ఎప్పట్లాగు పొలంలో పాలకోడు ఒడ్డుగా పెరిగిన పెద్ద పెద్ద మల్లి పొదలలోనించీ, దోసెడు మల్లిమొగ్గలు తెచ్చాడు ఉత్తరీయంలో, ''ఆ దుబ్బుల్లో పాము వుందంట. ఎందుకక్కడికి పోతావు? ఈ పువ్వులు లేకపోతే పోయిందిలే వెళ్లొద్దు'' అంది పువ్వులందుకుంటూ సత్యవతి. ''నన్నే పామూ ఏమీ చెయ్యదు, నీవు నా ప్రక్క చూస్తావున్నన్నాళ్ళూ'' అన్నాడు కళ్ళు నేలకి వాల్చి, నిండు చంద్రుణ్ణి చూచి సముద్రం పొంగినట్టూ పొంగింది సత్యవతి హృదయం.

రోజులు గడుస్తూనే వున్నాయి. మరొకనాడు పొలం నించీ వస్తూంటే మొండి తాడి చెట్టు క్రింద ఎగరలేక పడిపోయిన చిలకపిల్ల కనిపించింది... ఆ చెట్టు ప్రానిలో దాని గూడులో నించీ పడ్డది. దాన్ని తను సత్యవతి కిచ్చాడు. ఆ ఇచ్చిన చిలుకని ఒక బుట్టలో పెట్టి అరటి పండ్లు పెట్టింది సత్యవతి.

ఆ సాయంత్రం ఇంటి ఖర్చులకిగాను చెంగల్వరాయుడు బండి కట్టుకుని సంతకి వెళ్తున్నాడు. అతను ఎప్పుడు, ఎందుకు కట్టినా తన స్వంత బండి స్వంత ఎడ్లనే కడతాడు. కొంతదూరం వెళ్లేటప్పటికి సత్యవతి దారి కడ్డంగా నించుంది. ప్రక్కనించీ చెట్టుకింద నించీ దూకివచ్చి, ముందర రోజు వర్షానికి రోడ్డు అంతా తడిసి పారాణి పూసుకున్నట్టుగా వుంది. సత్యవతిని చూచి చెంగల్వ రాయుడు నిర్ఘాంతపోయాడు. ''ఎందుకొచ్చావు ఇంతదూరం? తిరిగి నిన్ను ఎట్లా తీసుకెళ్ళడం ఇంటికి?'' అన్నాడు, చిరునవ్వు, భయం కలిపి. ''ఏం భయం లేదులే. నన్నెవ్వరూ ఈ చుట్టుపట్ల ఏం చెయ్యలేరు. నేనందరికి తెలుసుగా ఇక్కడ. నీవు మాత్రం భద్రంగా వెళ్ళిరా'' అంటూ తన తలలో వాడిపోయిన మల్లెపూల చెండ్లు తీసి ఎడ్ల కొమ్ములకి కట్టింది. ''ఇదిగో అమ్మవారి కుంకం'' అని చెంగుముడిలో వున్న కుంకం తీసి నించుని వున్న అతనికి బొట్టుపెడుతూ ''నీ కూడా నేనుండగా సంతలో, అమ్మవారే పాడుతుందిలే. అందుకనే ఇది'' అంది. చెంగల్వరాయుడి హృదయంలో పువ్వులు వికసించి, కళ్ళలో తేనె లొలికినయి.

ఆ సాయంత్రం తిరిగి వచ్చేటప్పుడు, చిలకకి ఒక పంజరమూ, గోధుమ పూసలు తెచ్చాడు సత్యవతికి. ఈ పెరుగుతున్న మైత్రి సుబ్బారాయుడికి అంత నచ్చలేదు. కళ్లు చిట్లించాడు. వదినలు రుసరుసలాడారు.

మరో సంవత్సరం పైబడుతూంది. ఒకనాడు రవికె అంచులకి చెంగల్వరాయుడు తెచ్చిన గోధుమ పూసలు కుట్టుకుంటూ, చిలకకి పాటలు నేర్పుతూంది, సత్యవతి. మధ్యాహ్నం ఎండకి నిద్ర పోతున్న సుబ్బారాయుడు త్రుళ్ళిపడి లేచాడు. ''ఏం సత్యవతీ, ఏంటి శని! ఈ చిలకని ఎప్పుడో పీక పిసికేస్తాను. ఏం గోల నిద్ర లేకుండా!'' అని అరచి ఛటాలున లేచి బయట కెళ్ళిపోయాడు. క్రొత్తగా కొన్న కారెదున్నల జతని కట్టేస్తున్నాడు చింతాలు. దున్నపోతులు గున్న ఏనుగులలా ఉన్నాయి. ముక్కులు కుట్టారు. చింతాలుని ముప్పతిప్పలు పెడుతున్నాయి. ఇంట్లో కోపం మీద చావిట్లోకి వచ్చిన సుబ్బారాయుడు చెట్టుకు నిలబెట్టి వున్న దుక్కి కర్ర తీసి, దున్నల్ని ఒక పెద్ద దెబ్బ వేశాడు. జతలో ఒక పోతుకి నడుం మీద పడ్డది దెబ్బ. దున్న దద్దరిల్లి పోయింది. అప్పటి నించీ, ఆ దున్న పొగరుమోతు అయింది. సుబ్బారాయుడి గొంతు వినిపించినా, నీడ మీద పడినా అతన్ని చీరెయ్యడానికి చూస్తోంది. పగబట్టింది అతని మీద.

## అవన్నీ కామన్....




అమ్మాయిలకు ప్రేమలేఖలు రావడం చాలా కామన్ అంటూ చెబుతోంది 'మగధీర' క్వీన్ కాజల్ అగర్వాల్. చదువుకునే రోజుల్లో తనకూ చాలా ప్రేమలేఖలు వచ్చాయని, మొదట్లో వాటిని చూసి భయపడినా, రాను రాను వాటిని ఎంజాయ్ చేయడం అలవాటు చేసుకొన్నానని చెబుతోంది. తనని చాలా మంది ప్రేమించారనీ, ప్రేమిస్తున్నారని, తాను మాత్రం ఇంత వరకూ ఎవరినీ ప్రేమించలేదని స్పష్టం చేసింది. ఇటీవల తిరిగి రామ్‌చరణ్ సరసన నటించడానికి అవకాశం వచ్చినా, ఆ చిత్రానికి 'నో' చెప్పడం వెనుక కారణం ఆమె వివరించింది. ఆ సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా తనను ప్రపోజ్ చేశారనీ, ఇప్పట్లో సెకండ్ హీరోయిన్ పాత్రలు అంగీకరించే ప్రసక్తి లేదని తెగేసి చెప్పింది. వ్యక్తిగతంగా రామ్ అంటే ఎంత ఇష్టం ఉన్నా, కెరీర్ పరంగా దాన్ని పక్కన పెట్టాల్సి వచ్చిందని తెగ బాధ పడిపోతోంది. కాజల్, అల్లు అర్జున్‌తో సినిమా చేస్తోందని, ఈ సినిమా అంగీకరిస్తే డేట్స్ కుదరకపోవచ్చన్న అనుమానంతో 'నో' చెప్పిందని కొందరు అంటున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కాజల్ తనకు అల్లు అర్జున్ అంటే చాలా ఇష్టమన్న సంగతి కూడా ఈ సంఘటనలకు ఊతం ఇస్తోంది....

## కథాకళి

# మన వంతు కోసం...

సింహానికి చాలా ఆకలిగా ఉంది. గుహలోంచి బయల్దేరింది. వేట కోసం. కొద్ది దూరం వెళ్లగానే దానికి ఏటి గట్టున మేస్తున్న జింకల మంద కనిపించింది. అన్నింటిలోనూ కంటికి నదురుగా కనిపించిన ఓ జింకను ఎంచుకుంది. అడుగుల సవ్వడి కాకుండా నక్కినక్కి నడుస్తూ, పొదల మాటున పొంచిపొంచి ఉంటూ కాస్త దగ్గరదాకా వెళ్లింది సింహం. ఇక జింక తన నుంచి తప్పించుకునే అవకాశం లేదనే నిర్ధారణకు వచ్చాక ఒక్కమాటున పంజా విసురుతూ పొద చాటు నుంచి లంఘించింది. అంతకు రెండు క్షణాల ముందే ప్రమాదాన్ని శంకించిన జింక త్రుటిలో పంజాకు చిక్కకుండా పరుగందుకుంది. ముందు జింక, వెనక సింహం.. పరుగే పరుగు!



ఆకాశంలో అల్లంత దూరాన ఎగురుతున్న గద్ద తన డేగ కళ్లతో అక్కణ్నుంచే కింద జరుగుతున్న సంగతిని చూసింది. జింక చావడం ఖాయమని, 'సింహ భాగం' పోయాక తన వాటా తనకు దక్కుతుందని అక్కడే గిరికీలు కొట్టడం మొదలుపెట్టింది.

చెట్టుమీద ఉన్న కాకి ఈ వేటను గమనించింది. కావాల్సినంత ఆహారం దక్కుతుందనే అంచనాతో కావు కావు మంటూ తనవాళ్లందరినీ పిలుచుకుంది.

ఏటి నీటిలో గంట సేపటి నుంచి ఒంటికాలిపై చేపల కోసం జపం చేస్తున్న కొంగ కూడా జింకను, సింహాన్ని చూసింది. అయినా పట్టించుకోకుండా తన ప్రయత్నాన్ని తాను కొనసాగిస్తూనే ఉంది.

చెట్టుకింద కునుకు తీస్తున్న కుక్క ఒక్కసారిగా చెవులు రిక్కించింది. కాసేపు అటూ ఇటూ కదిపింది. చప్పుడు ఏమిటో నిశితంగా విన్నది. జింక, సింహం పరుగును గుర్తించింది. ఇది తనకు సంబంధించిన వ్యవహారం కాదని, తన ఎముకలు తనకు ఎలాగూ మిగులుతాయని గమనించి మళ్లీ నిద్రపోయింది.

పొద పక్కనే వేట కోసం పొంచి ఉన్న టక్కరి నక్క కూడా దీన్ని చూసింది. దానికి అప్పుడే నోరూరడం మొదలైంది. జింక చచ్చినట్టు, సింహానికి మాయ మాటలు చెప్పి అక్కణ్నుంచి పంపించి, మొత్తం మాంసాన్ని తానే తింటే ఎలా ఉంటుందని ఆలోచించింది. సింహాన్ని ఒప్పించడం కోసమని వేగంగా పరుగెత్తుతూ... వేట మధ్యలోకి వెళ్లింది. అంతే... అప్పుడే జింకపై విసిరిన సింహం పంజా నక్క నడుంపై పడింది!

**నీతి:** సింహం 'స్వశక్తి'తో తన ఆహారాన్ని తానే సంపాదించుకోవడానికి ప్రయత్నించింది. గద్ద తన 'దూరదృష్టి'తో ఎంతో దూరం నుంచి కూడా ఎక్కడ ఆహారం ఉందో కనిపెట్టగలిగింది. కాకి తనతో పాటు 'సమష్టి భావన'తో 'తన వాళ్లందరి'కి ఎంతో కొంత తిండి పెట్టాలనుకుంది. నోటికందుతుందో లేదో తెలియని ఆహారం కోసం తన 'జపం' మానడం అనవసరం అనుకుంది కొంగ. తన వాటా కోసం చివరిదాకా వేచి చూడక తప్పదని 'ఓపిక' మార్గాన్ని ఎంచుకుంది శునకం. స్వశక్తిపై ఆధారపడడం, దూరదృష్టి కలిగి ఉండడం, సమష్టి భావనతో వ్యవహరించడం, తన పనిపై ఏకాగ్రత కలిగి ఉండడం, ఫలితం లభించేదాకా ఓపిక పట్టడం... ఇవన్నీ మనిషికీ అత్యవసరమైన లక్షణాలు. అలా కాదని తొందరపడితే నక్కలా బొక్క బోర్లా పడక తప్పదు. జీవితమంటేనే మంచి కోసం, మన వంతు కోసం ఎదురు చూడడమే!

**– తిగుళ్ళ కృష్ణమూర్తి**

''దోసెడు ముత్యాల్లోనూ దోసెడు రత్నాలలోనూ పుట్టావు నువ్వు. నేనంటే ఎందుకిట్లా నీకు?'' అన్నాడు చెంగల్వరాయుడు ఒకనాడు – పై కొమ్మల నించీ ఎఱ్రమందార పువ్వులు కోస్తూ. పువ్వుల కోసం దోసిలి పట్టి పైకి చూస్తూ, ప్రతిమిలా నించుంది సత్యవతి.

''నా పుట్టుక మాటకేం గాని, నాకు నువ్వే పుట్టెడు బంగారం'' అంది కొంచెం కొంటెగా, ''నేనూ ఆలోచిస్తావుండా, నాకు చిన్న తాత కొడుకు వుండాడు – నాకు పినతండ్రి, ఆయనతో నీకోసం అడిగిద్దామని. ఎటొచ్చీ డబ్బు సంపాదించాలి. అదే చిక్కు'' అన్నాడు విచారంగా.

ఒకనాడు సుబ్బారాయుడుతో ''వయస్సు వచ్చిన పిల్ల అతగాడితో ఈ సఖ్యం ఏంటండీ?'' అంది ఆయన భార్య. అతను ఉలిక్కి పడ్డాడు. కోపంగా చూచి వూరుకున్నాడు. కాస్త ఆగి ''ఏం ఎవరన్నా ఏమన్నా అన్నారా ఊళ్ళో'' అన్నాడు.

తన మేడమీద గదిలో ఒక్కడే పచారు చేస్తున్నాడు. ఆ నాడు ఆ నగల మూట విషయమూ అంతేగా. ఈ పేరు ప్రతిష్ఠల కోసమేగా అంత భయపడ్డది? ఆ రోజు ఎవ్వరూ వెళ్లని, ఆ మల్లి దుబ్బల దగ్గరికి ఎందుకు వెళ్ళడం? ఆ చెంగల్వరాయుడు – దానికి పువ్వులకి అంటే, ఆ సత్యవతికి. ఎవ్వరో దొంగాళ్ళు దాచి పెట్టుకున్న ఆ నల్లగుడ్డ మూట వాడి కంటబడ్డది... అనుకుంటూ తిరిగాడు తనలో తాను. ఆనాడు ఆ మూట దొరికిందని మల్లి పొదలో పెట్టారనీ, వచ్చి సుబ్బా రాయుడితో చెప్పాడు – చెంగల్వరాయుడు. సుబ్బారాయుడి వళ్ళంతా వణికి పోయింది. ''మన పంట బోదెలోనా? మన పొలంలోనా? దొంగల సొమ్ము! రెండో కంటి వాడికి తెలియనివ్వద్దు'' అని ఆ మూట మోయించుకెళ్ళి గోనలేట్లో వదిలేయించేశాడు. లోకనింద ఏదైనా ఎట్లాగ భరించడం? ఎందుకైనా మంచిది, ఈ చెంగల్వరాయుణ్ణి వదల్చుకోవడం మంచిది. కిటికీలో నుంచీ చూస్తూ నిలబడ్డాడు. ఎదురుగా తామర గుంటలోనించి మునసబు గారి గూసుబాతులు ఈదుకుంటూ ఒడ్డు చేరుతున్నాయి. గట్టుమీద వెళ్తున్న వాళ్ళని పొడవటానికి మెడలు బారెడేసి చాచుకుంటూ, మనసబుగారి రాశి కావలి కుక్కలు, చెరువు గట్టు మీద తోకల మీద కూచుని నీళ్ళు చూస్తూ ఈగల్ని నాలికతో పడుతున్నాయి. చుట్టూ పచ్చచేలన్నీ సపిరి కప్పినట్టున్నాయి.

ఆ రాత్రి పొలంలో నించీ రాగానే వీరయ్య చెప్పాడు. రమ్మన్నారని, చెంగల్వరాయుడు లోపలి కెళ్లాడు, సుబ్బారాయుడి గదిలోకి.

ఒక అరగంట అయ్యాక, మేడమీద మంచినీళ్లు పెడుతూ అక్కమ్మ చూచింది – చెంగల్వ రాయుడు, సుబ్బారాయుడి గదిలోనించీ బయటకొస్తూ, అతని పలుచటి, తెల్లటి ఉత్తరీయంతో కళ్ళు తుడుచుకున్నాడు గుమ్మం బయట.

మరునాడు ఉదయం – తెల్లవారక ముందర్నించీ సత్యవతి తన గదిలో లేదు, అక్కమ్మ చూచేటప్పటికి. చెంగల్వరాయుడు తన బండి కట్టుకుని వెళ్ళిపోయిన దారినే నడుచుకుంటూ, వెతుక్కుంటూ వెళ్లింది అక్కమ్మ. కొంతదూరంలో పున్నయ్యకోనేటి ప్రక్కన, పున్నయ్యగారి సమాధుల కెదురుగా, ఒక చెట్టుక్రింద, ఒక ప్రక్కగా ఒరిగి ముడుచుకొని పండుకుని వుంది, సత్యవతి. కౌగిట్లో ఒక తెల్లటి ఉత్తరీయం వుంది. నిన్న రాత్రి చెంగల్వరాయుడు వేసుకున్నదే అది. ఉత్తరీయం కొంచెం ఒకచోట తడిగా వుంది గడ్డం క్రింద. మొఖం అంతా కన్నీళ్లు జారిన ఆనవాళ్లున్నాయి. కనురెప్పలు ఇంకా వాచి, తడిగానే ఉన్నాయి. అప్పుడే నిద్రపట్టినట్లుగా వుంది. సత్యవతికి తెలియకుండా ఆ ఉత్తరీయం లాగుకుని మరుగుగా ఒళ్లో పెట్టుకుని దాచింది. అక్కమ్మ, ఎవ్వరికీ కనబడకుండాను. రోడ్డు మీద నించీ, చెట్టు వరకూ ఉన్న పల్లంలో సన్న మన్ను మీద రెండు జతల అడుగులు కనిపించినయి. ఒకటి చిన్నది, ఇంకొకటి పెద్దది. అక్కమ్మ అడుగు జాడలు చేత్తో తుడిచేసింది.

ఆ ఎండల్లో ముహూర్తాల రోజుల్లోనే సత్యవతికి పెండ్లి అయింది.

పక్షం తిరగకముందే పుట్టింటికి పారిపోయి రావడమూ, అక్కమ్మ, వీరయ్యా తిరిగి తీసికెళ్ళడమున్నూ.

మరొక వారంపోయాక, జుట్టు విరియబోసుకుని మునసబుగారి అమ్మాయి పొలాల్లో తిరుగుతూందనీ, ఎక్కడో తూము మీద కూచుని వుందనీ రకరకాల వార్తలు చేరినయ్యి, పాలూరు గ్రామానికి, ఊళ్లో అమ్మలక్కలు చెప్పుకోసాగారు. ''అదేంటి, ఆ అన్నల్ని చూస్తే మనలాంటి వాళ్లకే బయ్యం. ఆ పిల్లదేమి రాతిగుండెమ్మా! బయమే లేదుగదా!' అంది ఒకావిడ. ''ఏమీ ఎరగనట్టే ఉంటాది. ఎంత జాణాతనమూ, జట్టీల్లాంటి అన్నలుండగా ఇట్లా కాపురం ఎగెయ్యటం!'' అంది రెండవ ఆవిడ బిందె తోముతూ, నీళ్లాట రేవులో. ''కాపురం మీద ఎట్లా వుంటాది?'' అన్నాడు ఒక అతను ఎడ్లని కడుగుతూ, ''ఆ! చెంగల్వరాయుణ్ణి ఇన్నాళ్లు ఇంట్లో గట్టా

ఉంచుకోకూడదు – ఆడపిల్లలుండే ఇంట్లో. ఇట్లాగే అవుతాయి'' అంది మరొక వేదాంతి – బిందె భుజం మీద పెట్టుకుంటూ. అన్నివార్తలు, సేవకుల ద్వారా మునసబు గారి కోడళ్లకి తెలుస్తున్నయి. సుబ్బారాయుడు వినక తప్పిందిగాదు. పిచ్చివాడిలా కోపం తెచ్చుకున్నాడు. పండ్లు పటపట కొరికాడు. పరవళ్ళు త్రొక్కుతున్నాడు.

మునసబుగారి ఒత్తిడివల్ల సత్యవతిని భూతవైద్యం చేయించడానికి పుట్టింటికి తీసుకొచ్చారు. నిశ్చయంగా, సత్యవతికి దయ్యం పట్టింది – అన్నాడు వైద్యుడు పేరంటాలయ్య. అక్కమ్మ మరిది రంగం నించీ ఉత్తరం వ్రాశాడు, చెంగల్వరాయుడు రంగంలో వున్నాడనీ, రెండు సంవత్సరాలు రంగూన్‌లోనే వుంటానన్నాడనీన్నీ. అక్కమ్మ సత్యవతితో చెప్పింది. ''అవును డబ్బు సంపాదించుకుని వస్తానన్నాడు'' అంది సత్యవతి, విచారంతో, ''ఏం లాభం సత్యవతీ, ఇక ఇప్పుడు?'' అంది అక్కమ్మ. సత్యవతి ముఖం కప్పుకుంది చేతులతో, చిన్నగా వెక్కి వెక్కి ఏడ్చింది – ఆపుకుంటూ.

సత్యవతిని తిరిగి పంపించే రోజున, సుబ్బారాయుడు అగ్నిపర్వతంలా బుస్సు లొదిలాడు. మొండి తాడికి కట్టేసిన కారుదున్న ఇంకా బుస్సు కొట్టింది ఇంకా పగ పట్టే వుంది.

రోజులు గడుస్తున్నాయి. తొలకరి వచ్చింది. రాత్రుళ్లంతా తామర గుంటలో కప్పలు బెకబెక మంటున్నాయి. పున్నయ్య చెరువులోనూ, తామర గుంటల్లోనూ, తామర పువ్వులు వర్షానికి నలిగి పోయినాయి. మొండితాడి మీద చంద్రుడుదయించాడు, పౌర్ణమి చంద్రుడు, ఎర్రగా – నిశాదేవి కుంకుమ బొట్టులా, రాత్రి గడిచిన కొద్దీ పున్నమ నెల తెల్లబారింది. భోజనాల వేళకి సత్యవతి వచ్చింది – ఈసారి నగలు తీయాలన్న స్పృహ కూడా లేదు. తిరిగి సత్యవతిని చూచేటప్పటికి, పంజరంలో చిలక, ''కిలకిల'' లాడింది. రెక్కలు రెపరెప కొట్టుకుంటూ, పాట మొదలెట్టింది. ఆ గోలకి పెంపుడు కుక్కని పరీక్షిస్తున్న సుబ్బారాయుడు, తల పైకెత్తి చూచాడు. కళ్లు ఎర్రబారినయి. వళ్లు వణికింది, కోపంతో. ''ఈ గడప తొక్కొద్దు అనలే? ఈ శని ఇంకా మాకు విరగడకాలే? తల ఎత్తుకుని బ్రతకనివ్వదల్లే వుంది!'' అంటూ అంగల మీద లేచి, చావిట్లో చిలక కొయ్యకి వున్న ఉత్తరీయం మీద వేసుకుని, చెప్పుల్లో కాళ్లు పెడుతూ, ''వచ్చిన దారినే నడు!'' అన్నాడు. సత్యవతి వెనక్కి వెనక్కి చూచింది వెళ్ళబోతూ. తనకేసే చూస్తూ గూట్లో చిలక పాట పాడుతూనే వుంది.

''పరువుగల అన్నలూ పయనమైనారా?
రాకాసి వదినలూ, రానివ్వరేమో''

మండువాలోకి వచ్చిన పెద్దవదిన ''తెల్లరాక తీసికెళ్ళండి'' అంది ''ఎవ్వళ్ళన్నా చూస్తే – తిరిగి వచ్చేసినట్టూ?'' అంటూ అతను ముందూ, సత్యవతి వెనకా, నడిచి పోతూనే వున్నారు. దారిలో తుమ్మమానులు నల్లగా నించుని వున్నాయి. నేవళంగా, పచ్చగా పెరిగి వున్న చెట్లన్నీ పూర్తిగా, విభూదిలో ముంచెత్తినట్టూ వున్నయి – ఆ పున్నమ వెలుగులో. అతని కిర్రు చెప్పుల చప్పుడికి, దారికి అడ్డంగా వున్న ఒక పెద్ద పాము ప్రక్కగా తప్పుకు పోయింది. దారి ప్రక్కన, మళ్ళల్లో నీళ్లు తళతళలాడుతున్నయి.

సుబ్బారాయుడు ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి చుక్క పొడిచింది. ''వాళ్ల గుమ్మం వరకూ పంపించి వచ్చాను. లోపలికి వెళ్ళడానికి నాకు ముఖం చెల్లలేదు'' అన్నాడు భార్య అడుగగా.

తిరిగి మరునాడు వాళ్ళ అత్తవారి మనుష్యులు వచ్చారు – వెతుక్కుంటూ. అన్నగారి ముఖం వెనక్కి తిరగంగానే, ఇంట్లోకి వెళ్ళకుండా ఎక్కడికో పారిపోయింది. నూతులు, గోతులూ దేవించారు. చెరువులు గాలించారు, ఆ చుట్టుపట్ల ఎక్కడా సత్యవతి జాడ కనబడలేదు.

వెతికి వెతికి వేసారిపోయి, మునసబుగారు మంచం ఎక్కారు. చేతినున్న షాహుకారు మురుగు అరిచేతిలో పడుతూంది. క్షీణించి పోయి మూడు నెలలు తిరగక ముందే కాలం చేసారు.

సుబ్బారాయుడు, ఇంటి విషయం, ఆస్తి విషయం ఏమీ శ్రద్ధ పట్టుకోడం లేదు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ చావిట్లోనే కూచుని వుంటాడు. సత్యవతి పరారి అయిపోయిన సంవత్సరంలోనే గమడిపోతుల జత అమ్మేశారు. వెంట వెంటనే దుక్కిటెడ్లు పాడి పశువులూ అన్నీ అమ్ముడు పోయినయి. సుబ్బారాయుడు తన పట్టెమంచం పడక మానేశాడు. చావిట్లో ఒక నులక మంచం వేసుకున్నాడు. భోజనం, పడక అన్నీ అక్కడే. అమ్మవారి గుడి ముఖం చూడడం మానేశాడు. సత్తెమ్మ సంబరాలు ఆగిపోయినయి. ఆస్తి క్షీణించ సాగింది. ఆశ్రిత సేవకవర్గం లోగిలి విడిచి పోయారు క్రమంగా. ఏదో తగుపాటి సంబంధాలకి ఆడపిల్లల్ని ఇచ్చేసారు. ''ఎంత పౌరుష వంతుడు! ఆ సంబంధాలు ఎట్లా అందాడో! ఏదో మతిపోయిందతనికి – చెల్లెలు తెచ్చి పెట్టిన తలవంపులకి'' అని అందరూ వుసూరుమన్నారు. ఆస్తి ఆఖరికి అంతా పోయింది. ఆ లోగిలి ఒక్కటి నిల్చింది. దానికో రక్షణ లేదు. దానిమీద అప్పులవుతున్నాయి.

సుబ్బారాయుడు అకాలంలోనే వృద్ధుడయ్యాడు. ముఖం అంతా తీరని భారంతో ముడతలు పడ్డది – మండు టెండలకి తన పొలంలో నల్లరేవడి బీటలారినట్టూ.

అతన్ని చూడగానే పంజరంలో చిలుక భయపడి రెక్కలు 'టపటప' లాడించి బయటికి ఎగిరి పోవడానికి ప్రయత్నించేది. సుబ్బారాయుడు చిలక మీద కోపం కూడా తెచ్చుకోటం లేదు. సత్యవతి వెళ్ళిపోయిన దగ్గరనించీ చిలక తిండి తీర్డాలు మానేసింది – అక్కమ్మ పెట్టినా తినకుండా ముక్కు రెక్కలలో పెట్టుకుని అలాగే పడి వుండేది.

రంగూను నించీ, వచ్చిన మరిది, 'చెంగల్వరాయుడు జ్వరంపడి రంగూనులోనే పోయా'డని అక్కమ్మతో చెప్పాడు. అక్కమ్మ గుండెలో బరువుతో వెళ్ళి, చిలక పంజరం తెరిచి చిలకను వదిలేసింది.

పేదరికం భరించలేకనూ, పువ్వులమ్మిన వూళ్లో కట్టెలమ్ముడం కష్టమయిన్నీ, తమ్ములందరూ తలకొక దారినీ బస్తీలు పట్టారు – వాళ్ళవాళ్ళ కుటుంబాలతో, దుకాణాలు పెట్టుకుని, గుమస్తాగిరులు సంపాదించుకుని చిన్న బ్రతుకులు బ్రతుకుతున్నారు.

జరిగిన ఈ గాధ అంతా, ఈ లోగిలి విచిత్ర పరిణామం అంతా ఆ అరుగు మీద కూచున్న అక్కమ్మ తలపోసుకుంది.



ఆ రాత్రంతా వచ్చిన కొద్దిమంది బంధువులూ, అందరూ సుబ్బారాయుడు మంచం చుట్టూ జాగారం చేశారు. మధ్యరాత్రికి వృద్ధుడికి మళ్ళా మెలుకువ వచ్చింది. ''ఇంకా రాలేదూ? సత్యవతి?'' అన్నాడు. ''లేదన్నా'' అంది అక్కమ్మ. ''అక్కమ్మా, ఇంక మీదట సత్తెమ్మ సంబరాలు చేయిస్తావా? ఆయమ్మ పేరే సత్యవతిది'' అన్నాడు ఆగి ఆగి కొంచెం ఆయాసంతో. ''అట్లాగే అన్నా, తప్పకుండా చేయిస్తాం'' అంది నుదురుమీద చెయ్యి వేస్తూ.

రోగికి కాస్త ఆయాసం ఎక్కువయింది. బయట నించీ తొలకరి గాలులు చల్లగా వీస్తున్నాయి. ఆ చిన్నగాలిలో ఆ పాత చిలక పంజరం కొంచెం వూగిసలాడింది. నీళ్లల్లో వజ్రంలా తెలిమబ్బు చాటునించీ చంద్రుడుదయించాడు. నడిరాత్రి గడిచిపోయింది.

మలికోడి కూసేటప్పటికి ''సత్యవతీ, సత్యవతీ!'' అని గట్టిగా అరిచాడు. ''అన్నా, అన్నా, ఇంకా రాలేదు'' అంది అక్కమ్మ. ''ఆ! ఆ! గోనలేరు పొంగింది. అదిగో నురగలు. కన్నయ్య లేడూ!'' అన్నాడు ఆగుతూ ఆయాసంతో, కొంచెం ఆగాడు. ''బల్లకట్టు కన్నయ్య లేడే. అక్కమ్మా లేడు... నేనే బల్లకట్టు వీద పడేశానే... అక్కమ్మా... అంతే!'' అన్నాడు. అంతా నిశ్శబ్దం. మళ్ళీ ''సత్యవతీ!'' అనే కేక. ''వస్తాదిలే పడుకో అన్నా'' అంది అక్కమ్మ మృదువుగా. సుబ్బారాయుడు కండ్లు ఇంకా కొంచెం తెరిచాడు. ''ఎర్రిదానా! సత్యవతి రాదు! గోనలేరు మింగేసింది. బల్లకట్టు మీద నించీ నీళ్ళలోకి పోయింది... అదిగో అదిగో... నేనే... నా చేతులారా...'' సగం తెరిచిన కళ్ళు మూతలు బడ్డాయి.

గదిలో చుట్టూ వస్తున్న కన్నీళ్ళన్నీ గడ్డలు కట్టాయి. శ్వాస వినబడడం ఆగింది – రోగిది.

నీడలా ప్రమిద వెలిగించి, గాలికి చెయ్యి అడ్డం పెట్టుకుని, దీపంతో లోపల్నించీ వచ్చింది చంద్రమ్మ తలదగ్గర పెట్టడానికి.

*